ప్రజాశక్తి

మంగళవారం 20 జూన్ 2023 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

కౌలు భూముల ధరలకు రెక్కలు

ప్రజాశక్తి-నందిగామ

రాష్ట్రంలో నూటికి 70 శాతం మంది కౌలు రైతులే వ్యవసాయాన్ని సాగుచేస్తున్నారు. 32 లక్షల కుటుంబాలు కౌలు వ్యవసాయం చేస్తున్నాయి. మొత్తంగా చూస్తే కౌలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వారికి సంఖ్య కోటిపైనే ఉంది. కృష్ణాడెల్టాలో కాలువలకు సాగు నీరు విడుదల చేయడం, త్వరలోనే నైరుతీ రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయనే వాతావరణ శాస్త్ర వేత్తల సూచనలతో జిల్లా రైతాంగం సాగుకు సమాయత్తం అవుతోంది. జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలోని భూములను సాగుచేస్తున్న కౌలు రైతులు 2023-24 సీజన్‌కు సంబంధించి భూయజమానులతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. రహదారి, నీటి సౌకర్యాలు, అపరాల దిగుబడులు ఆధారంగా కౌలు ధరలు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా ఉంటున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో కౌలు భూముల ధరలు అమాంతం పెరగటంతో కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప పంట ఈ ఏడాది ఆశాజనకంగా ఉండటంతో రైతులు, కౌలురైతులు సాగునకు ఆసక్తి చూపుతున్నారు. నీటి వసతి ఉన్న పొలాలకు డిమాండ్ బాగా ఉంది. ప్రధానంగా మిరప అధికంగా సాగయ్యే నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో ఇప్పటికే కౌలుకు తీసుకున్న పొలాలను దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచారు.

గణాంకాలు ఘనం..ఆచరణే శూన్యం

జిల్లాలో 1.12 లక్షల హెక్టార్లు సాగు భూమి ఉంది. 2022-23 సంవత్సరంలో 38,387 మంది కౌలు రైతులు సిసిఆర్‌సి కార్డులు తీసుకున్నారు. 4,510 మంది కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుంది. రూ.39 కోట్లు రుణాలు ఇవ్వాల్సి ఉండగా, 3,456 మంది కౌలురైతులు రూ.25.88 కోట్లు రుణాలు తీసుకున్నారు. జిల్లాలో సుమారు లక్షమందికిపైగా కౌలు రైతులు ఉన్నారు. ఈ సీజన్‌లో 40,515 మంది కౌలురైతులకు కార్డులు అందజేస్తామని అధికార యంత్రాంగం ప్రకటించింది. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 24,800 మంది కౌలు రైతులు ఉన్నట్లుగా అంచనా. గత సీజన్‌లో మిరప కాయలు క్వింటా రూ.23 వేలు ధర పలికింది. పత్తి దిగుబడితో పాటు ధరలు తగ్గిపోవడంతో సాగు చేసినరైతులు తీవ్రంగా నష్టపోయారు. మిరప సాగుకు ఈ ఏడాది రైతులు పోటీ పడుతున్నారు. పెద్ద మొత్తంలో కౌలు భూములు సాగుకు తీసుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దేవాలయ భూములను కొన్ని చోట్ల పోటీ పడి పాటలు దక్కించుకున్నారు. ఎకరం రూ.25 వేలు కౌలు ధర పలికింది. పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు, శివాపురం తదితర గ్రామాల్లో ఎకరం కౌలు రూ.45 వేలుకు పలుకుతోంది. సుబాబుల్‌కు గిట్టుబాటు ధరలేదని వీటిని తొలగించి పొలాలు చదునుచేసుకుని కౌలుకు ఇస్తున్నారు. నీటి వసతిని బట్టి ఎకరం కౌలు రూ.10 వేలు నుండి రూ.45 వేలు ఉంది. గత ఆర్థిక సంవత్సరాన్ని తీసుకుంటే అర్హులలో పది శాతం మందికే రుణాలు ఇవ్వాలని నిర్ణయించినా ఆ లక్ష్యమూ చేరలేకపోయారు. ఇంకో పక్క అగ్రిమెంటు లేకుండా సాగు చేపట్టే రైతులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఎక్కువ శాతం మంది ప్రైవేటు వ్యాపారుల నుండి అధిక వడ్డీలకు రుణాలు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా పరిశీలిస్తే ఏటేటా ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోవటం, పెట్టుబడులు సైతం వచ్చే పరిస్థితి లేక రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితి ఉంది. గత ఖరీఫ్‌లో అధికవర్షాల ప్రభావంతో పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. ఆ నష్టాలను భర్తీ చేసుకునేందుకు రబీలో మొక్కజొన్న సాగు చేయగా అకాల వర్షాలు మరోసారి కౌలుదారులను దెబ్బతీశాయి. ప్రకృతి విపత్తుల సమయంలో అపన్నహస్తం, సాగుకు రుణ సదుపాయం లేక పోవటంతో వారి సాగుకు భద్రత కరవైంది. పలు సందర్భాల్లో గిట్టుబాటు ధరలు రాక రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కౌలు రైతులకు అండగా బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని పలువురు కౌలు రైతులు కోరుతున్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

హాస్టల్ విద్యార్థినిపై లైంగిక దాడి?

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

మచిలీపట్నంలో హాస్టల్ విద్యార్థినిపై ఆదివారం లైంగిక దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఎన్ గొల్లపాలెంకు చెందిన సతీష్ ఆదివారం నోబుల్ కాలనీలో ప్రభుత్వ హాస్టల్లో ఉన్న విద్యార్థినిని బయటకు తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే ఆదివారం ఎస్ఎన్ గొల్లపాలెంకు చెందిన ఆవుల సతీష్ స్థానిక 13వ డివిజనులోని ప్రభుత్వ హాస్టల్ నుండి డిగ్రీ విద్యార్థిని బయటకు తీసుకెళ్లాడు. విద్యార్థినికి పూర్తిగా మద్యం సేవింపచేసి లైంగిక దాడికి పాల్పడినట్టు తెలుస్తోంది. తిరిగి హాస్టల్ చేరుకున్న విద్యార్థిని పరిస్థితి గమనించిన హాస్టల్ వార్డెన్ అనుమానంతో వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. సోమవారం విద్యార్థినిని హాస్టల్ వార్డెన్ ఆఘమేఘాల మీద డిశ్చార్జ్ చేయించి తనతో తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి వైసీపీ కార్యకర్త అంటూ టీడీపీ నేతలు, కాదు కాదు టిడిపి కార్యకర్తేనంటూ వైసీపీ నేతలు సోషల్ మీడియా వేదికగా పరస్పర విమర్శలు చేసుకున్నారు. మీడియా వాట్సాప్ గ్రూపుల్లోనూ రకరకాలుగా కథనాలు వస్తున్నా పోలీసులు మాత్రం నోరు విప్పలేదు. వివరణ కోసం మీడియా ప్రతినిధులు సంప్రదించినా ఎలాంటి వివరాలు అందించలేదు. ఉదయం నుండి విపరీత పరిణామాలు, హై డ్రామాలు చోటు చేసుకున్నాయి. ఒక దశలో పోలీసులు కేసును పక్కదారి పట్టిస్తున్నారా లేక విచారణ పేరుతో ఘటన పూర్వాపరాలు సేకరిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. కేవలం దర్యాప్తు కొనసాగుతోందని, లైంగిక దాడికి పాల్పడిన సతీష్ అదుపులో ఉన్నాడని పోలీసులు చెప్పుకొచ్చారు. ఘటనపై టీడీపీ మహిళా నాయకులు, ఐద్వా ప్రతినిధులు పోలీసులు, అధికారులను కలిసి వినతి పత్రాలు సైతం సమర్పించారు. మచిలీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్ కు వెళ్లి తెలుగు (మిగతా 6లో)

సిపిఎం సీనియర్ నేత

లంకా కాళిదాసు అస్తమయం

ప్రజాశక్తి-గుడివాడ

గుడివాడ పట్టణానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకుడు, కార్మిక నేత లంకా కాళిదాసు(85) సోమవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య అనసూయ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మొదటి కుమారుడు సురేంద్ర సాహితీ స్రవంతి అధ్యక్షుడిగా, రెండో కుమారుడు బాలమురళీకృష్ణ ఆర్ఎంపీ వైద్యులుగా పనిచేస్తున్నారు. లంకా పూర్ణాచార్యులు, బాలమ్మల దంపతులకు 1937, నవంబర్ 5న పామర్రు మండలం కురుమద్దాలి గ్రామంలో కాళిదాసు జన్మించారు. తండ్రి పూర్ణాచార్యులు వృత్తిరీత్యా వడ్రంగి పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఆయనకు ముగ్గురు కుమారులు జన్మించగా అందులో ప్రథమ కుమారుడు కాళిదాసు. తన తండ్రి వృత్తిని ఎంచుకున్న కాళిదాసు వడ్రంగి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న క్రమంలో కీర్తిశేషులు పుట్టగుంట సుబ్బారావు నాయకత్వంలో భూస్వాముల వ్యతిరేక పోరాటంలో ఆకర్షితులై వృత్తి పని చేసుకుంటూ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో చేరారు. అంతేకాకుండా యువజన సంఘం

లంక కాళిదాసుకు నివాళులర్పిస్తున్న నాయకులు

జిల్లా బాధ్యతలు కూడా చేపట్టారు. 30 ఏళ్లకు పైగా సిపిఎం కార్యదర్శిగా, వ్యవసాయ కార్మిక సంఘం బాధ్యతలు స్వీకరించి పనిచేశారు. గుడివాడ పట్టణంలో పార్టీ బలహీనంగా ఉండటంతో ముందు ముందుగా పుట్టగుంట సుబ్బారావు తర్వాత కాళిదాసు బలోపేతం చేయడానికి తనవంతుగా కృషి చేశారు. తాను చేసే వృత్తి మానేసి (మిగతా 6లో)

విద్యుత్ భారాలను రద్దు చేయాల్సిందే

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- 'పోరుబాట'లో నల్ల బెలూన్లు వదిలి నిరసన

అధికంగా వచ్చిన విద్యుత్ బిల్లులను చూపుతున్న సిపిఎం నేతలు, వినియోగదారులు

ప్రజాశక్తి-విజయవాడ, సింగ్‌నగర్

సర్దుబాటు ఛార్జీల పేరుతో వినియోగదారులపై మోపిన విద్యుత్ భారాలను రద్దు చేయాల్సిందేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని సింగ్‌నగర్ 58, 59 డివిజన్ల పరిధిలో 'విద్యుత్ పోరుబాట' కార్యక్రమం రెండో రోజు సోమవారం శ్రీనివాసరావు ప్రారంభించారు. విద్యుత్ ఛార్జీలను వ్యతిరేకిస్తూ ఈ సందర్భంగా స్థానికులతో కలిసి నల్లబెలూన్లు గాల్లోకి వదిలి నిరసన తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ వినియోగదారులు వారికొచ్చిన అధిక బిల్లులను సిపిఎం నాయకులకు చూపిస్తూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ భారాలపై సిపిఎం ఇంటింటికి తిరిగి ప్రజలను చైతన్యపరుస్తోందని అన్నారు. భవిష్యత్తులో ఉద్యమాన్ని వివిధ రూపాల్లో మరింత ఉధృతం చేస్తామన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాదుడే బాదుడని విమర్శించిన జగన్ నేడు బాదుడులో అందరినీ మించిపోయారని విమర్శించారు. విద్యుత్, వంటగ్యాస్, ఇంటి పన్నులు, చెత్త పన్ను, నిత్యావసర వస్తువుల ధరలు ఇలా పలు రూపాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను దోచుకుంటున్నాయని అన్నారు. విద్యుత్ సంస్కరణలతో చౌకైన కరెంటు అందిస్తామని నమ్మించిన పాలకులు నేడు నట్టేలా ముంచారని విమర్శించారు. విద్యుత్ సంస్కరణలతో కార్పొరేట్ కంపెనీలు బాగుపడ్డాయని, విద్యుత్ రంగం నాశనమైందని, ఫలితంగా ప్రజలపై భారాలు పడుతున్నాయని తెలిపారు. విద్యుత్ సంస్కరణలను బలపరిచిన పార్టీలు ఆత్మవిమర్శ చేసుకుని ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కాశీనాథ్, కె.శ్రీదేవి, సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి బి.రమణారావు, నాయకులు కె.దుర్గారావు, ప్రవీణ్, ఝాన్సీ, సిహెచ్.శ్రీనివాస్, వై.సుబ్బారావు, నిజాముద్దీన్, మూర్తి, నాగార్జున, దేవి కుమారి తదితరులు పాల్గొన్నారు.

చదువులో రాణించడం అభినందనీయం

ప్రజాశక్తి- నందిగామ : సమాజ వికాసంలో అధ్యాపకులదే ప్రధాన భూమిక అని నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు పేర్కొన్నారు. నందిగామ పట్టణంలోని చైతన్య కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇటీవల విడుదలైన ఏపీ ఎంసెట్ , జేఈఈ అడ్వాన్ డ్ పరీక్ష ఫలితాలలో ఉత్తమ మార్కులతో ర్యాంకులు సాధించిన చైతన్య కళాశాల విద్యార్థులను నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్ రావు సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్ మోహన్ రావు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు చదువుల్లో రాణించటం అభినందనీయమని తెలిపారు. ఒక విద్యార్థి బాగా చదువుకొని అభివృద్ధి చెందితే ఆ కుటుంబం బాగుపడుతుందన్నారు. చైతన్య కళాశాలల చైర్మన్ అమరనేని రమేష్ బాబు, డైరెక్టర్ అమరనేని కార్తీక్, అకాడమిక్ డైరెక్టర్ అమరనేని శాంతి ప్రత్యూష పాల్గొన్నారు .

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి -నందిగామ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నందిగామ డిప్యూటీ తహశీల్దారు పి.మణి పేర్కొన్నారు. సోమవారం నందిగామ పట్టణంలో కృష్ణ వెన్నెల మహిళా సోసైటీ నందు కమ్యూనిటీ హెల్త్ సభ్యులు సమావేశం జరిగింది. ఈ సమావేశంకు ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ తహశీల్దారు పి.మణి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలల్లో రాణించాలని కోరారు. ప్రతి మహిళ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కమ్యూనిటీ మహిళలు ఆరోగ్యపరమైన సమస్యలు ఉంటే సోసైటీ ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు. న్యాయవాది కన్నెకంటి జీవరత్నం, ఎస్ఐ రమణ, ఐసిటిసి కౌన్సిలర్ కె.సుమన్, ఎయిడ్స్ కౌన్సిలరు అచ్చమాంబ పాల్గొన్నారు.

జనసేనకు ఆదరణ : అక్కల

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ గెలుపు తథ్యమని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు(గాంధీ) అన్నారు. కొండపల్లిలో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మైలవరం జనసేన అభ్యర్థిగా తాను నిలబడి 25వేల పైగా మెజార్టీతో గెలుస్తామని ధీమా ఆయన వ్యక్తం చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే మైలవరం నియోజకవర్గంలో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం ఇంటింటికి కుళాయిని అందించి తీరతామన్నారు. కొండపల్లి నియోజకవర్గంలో ఎప్పటినుండో అపరిష్కృతంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేస్తామన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నేతలు వీర మహిళలు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - తిరువూరు : అఖిల భారత కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ 54వ పుట్టి నరోజు వేడుకలను ఆపార్టీ నాయకు లు, కార్యకర్తలు సోమవారం తిరువూ రులోని రాజీవ్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈకా ర్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తిరువూరు మండల, పట్టణ అధ్యక్షులు పల్లెపాటి శ్రీనివాసరావు, ఆంజనేయులు, జీవన్ బాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బొడ్డు ప్రకాశరావు, రాష్ట్ర బిసి సెల్. నాయకు లు కష్ణ మోహన్, రామిసెట్టి జగన్నాథం పాల్గొన్నారు. **ప్రజాశక్తి - మైలవరం :** లికాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బోస్ బొమ్మ సెంటర్లో సోమవారం రాహుల్ గాంధీ పుట్టిన రోజు సందర్భంగా భారీ కేకును కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పాలు, మజ్జిగ ప్యాకెట్లు, జ్యూస్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షులు దోసపాటి గిరిధర్ కుమార్ పాల్గొన్నారు.

నందిగామ ఎంఇఒ పద్మకు సన్మానం

పద్మాను సన్మానిస్తున్న యుటీఎఫ్, ఉపాధ్యాయ సంఘం నాయకులు

ప్రజాశక్తి నందిగామ : నందిగామ మండల విద్యాశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంఈఓ ఎం పద్మను నందిగామ మండల యుటీఎఫ్ నాయకులు ,ఉపాధ్యాయ సంఘం నాయకులు సోమవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. నందిగామ మండలం, చందర్లపాడు మండలం విద్యాశాఖ అధికారిగా పనిచేస్తూ బదిలీపై కంచికచర్ల మండలంనకు బదిలీపై వెళ్లిన బి .బాలాజీ కి, నందిగామ మండల నూతన విద్యాశాఖ అధికారిణిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎం .పద్మకు యూ.టి.ఎఫ్ నందిగామ, చందర్లపాడు మండల శాఖల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పీఎస్ హరినాథ్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా ట్రెజరర్ మహేశ్వర వెంకటేశ్వరరావు, నందిగామ, చందర్లపాడు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనిగుంట్ల ఎల్లమందయ్య ,చిన్న నరసరావు , శ్రీనివాస్ నాయక్ ,సత్యనారాయణ ,కుంచెం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జగ్గయపేట ఎంఈఒ-2 గా చిట్టిబాబు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : కంచికచర్ల మండల విద్యాశాఖాధికారిగా పనిచేస్తూఎంఈఓ -2 పదోన్నతుల కౌన్సిలింగ్ లో జగ్గయ్యపేట మండల విద్యాశాఖకు మండల విద్యాశాఖ అధికారి-2 గా ఎంపికై బాధ్యతలు నిర్వర్తించేందుకు సోమవారం విధులలో చేరిన ఎల్. చిట్టిబాబు కి యుటిఎఫ్ జగ్గయ్యపేట మండల శాఖ నాయకుల్ను, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం కష్ణయ్య, యుటిఎఫ్ జగ్గయ్యపేట మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి ప్రవీణ్ కుమార్, అల్లిక నరసింహారావు, కోశాధికారి ప్రసాద్ బాబు, సహాధ్యక్షులు జి ముక్తేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జే.సుదానంద్, ఎల్వి సత్యనారాయణ, జీవిటి రాజశేఖర్, సిహెచ్ఎస్ఎన్ మూర్తి, ఎండి సైదాబాషా, కె సాయి శ్రీనివాసరావు, ఎలమందల రవి, జి శేఖర్, డి రత్న ప్రసాద్, ఎండి మునీర్ భాషా, అబ్దుల్ రెహమాన్, పరమేశ్వరరావు, పరసా శ్రీనివాసరావు, గంగాధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

గంపలగూడెం విద్యాశాఖ అధికారి నరసింహారావు

ప్రజాశక్తి - గంపలగూడెం : స్థానిక మండల విద్యాశాఖ అధికారిగా -2 గా,నరసింహారావు నియమితులైనారు. ఈ మేరకు సోమవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టారు. ఇటీవల విద్యా శాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా జగ్గయ్యపేట మండలం షేర్ మహమ్మద్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. పదోన్నతి పై నరసింహారావు విద్యాశాఖ అధికారిగా పెంపకైనారు. ఇప్పటివరకు గంపలగూడెం లో పనిచేసిన బి సోమశేఖర్ నాయక్ విజయవాడ వెస్ట్ ఎంఈఓ - 2 గా పదవి బాధ్యతలు చేపట్టారు.

కంచికచర్ల ఎంఈఓ-2 గా బాలాజీ

ప్రజాశక్తి కంచికచర్ల : కంచికచర్ల ఎంఈఓ-2గా బి. బాలాజీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నందిగామ నుండి కంచికచర్ల కు ఆయన బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు కంచికచర్ల ఎంఈఓ పనిచేసిన ఎల్ చిట్టిబాబు జగ్గయ్యపేటకు బదిలీ అయ్యారు. అయితే కంచికచర్ల ఎంఈఓ 1 గా ఇంకా ఎవరిని నియమించలేదు. ప్రభుత్వం ఒక్కో మండలానికి ఇద్దరు చొప్పున ఎంఈఓ లను నియమిస్తున్న విషయం తెలిసిందే.

జగనన్న ఆణిముత్యాలు బహుమతులు అందజేత

ఇబ్రహీంపట్నంలో..



పెనుగంచిప్రోలులో...

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం పాఠశాల స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాలలో 10వ తరగతిలో ప్రథమస్థానం కె శైలజా 545 మార్కులు, ద్వితీయ స్థానం జిన్న బేజారమ్మ 517మార్కులు, తృతీయ బి లీలాభవానీ 511 మార్కులు సాధించిన విద్యార్థునులకు 28వవార్డు కౌన్సిలర్ బి నాగరాజకుమారి, మండల విద్యాశాఖాధికారి సిహెచ్ పుష్పలత నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె శైలజ, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - విజయవాడ రూరల్ :** విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు పొందిన విద్యార్థులను మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జగనన్న ఆణిముత్యాలు కింద ప్రభుత్వం మంజూరు చేసిన నగదు పురస్కారాలతోపాటు బంగారు, రజత, కాంస్య పతకాలను బెజవాడ శ్రీరామ్ (577), మహ్మద్ సాయి సమీర్ (572), గాజుల రాజ్యలక్ష్మి (557)కు అందజేశారు. ఈ కార్యక్రమంలో నున్న ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, ఎంపిటిసి సభ్యురాలు పి గిరిజా కుమారి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు :** జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమములో భాగంగా స్థానిక కాకాని వెంకటరత్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో(బాలుర) 10 వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని విద్యార్థులకు నగదు ప్రోత్సహకం మరియు మెడల్ బహుకరణ గ్రామ పంచాయితీ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి అందజేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని విద్యార్థులు ప్రథమ స్థానంరేగండ్ల నాగ త్రిశూల్, ద్వితీయస్థానం బాడిశ తరుణశ్రీ, తృతీయ స్థానం పెద్ది వంశీలకు అందించి ప్రత్యేకంగా ఆమె అభినందించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకటనర్సు, ప్రదనోపాధ్యాయురాలు జలజ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-నందిగామ :** విద్యార్థినీ విద్యార్థులు కష్టపడి చదువుకుని తమ తల్లిదండ్రులకు మంచి గౌరవ ప్రతిష్టలు తీసుకురావాలని ఆగ్రోస్ మార్కెటింగ్ రాష్ట్ర డైరెక్టరు మంగునూరు కొండారెడ్డి అన్నారు. నందిగామ మండలం పెద్దవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో అత్యదికమార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో సోమవారం బహుమతులు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆశాదీప్తి, నివాహారిక, బషీర్‌లకు ఆగ్రోస్ డైరెక్టరు మంగునూరు కొండారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వీరికి సర్టిఫికెట్స్, మెడల్స్, నగదు బహుమతులు ప్రధానంచేశారు. కొండారెడ్డి వ్యక్తిగతంగా ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, సర్పంచ్ బాణావత్ దేవిలీ పాల్గొన్నారు.

వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి భక్తులు వెండి కిరీటాన్ని సమర్పించారు. ఆలయ ఈవో సీతారామయ్య, ప్రధాన అర్చకులు బాలకష్ణ శాస్త్రికి సుమారు లక్ష 50 వేల రూపాయల విలువ కలిగిన రెండు కేజీల వెండి కిరీటాన్ని నందిగామ పట్టణానికి చెందిన చిన్నసత్యనారాయణ , భార్య ఇంద్రాదేవిలు అందజేశారు. అర్చకులు స్వామివారికి అభిషేకాలు పూజలు వెండి కిరీటానికి సంప్రోక్షణచేసి స్వామి వారికీ ఆ లంకరించరు, దాతలకు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి ప్రసాదం అందజేశారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

ప్రజాశక్తి-మైలవరం : పట్టణంలోని ఒక ఇంటిలో పేకాట ఆడుతున్నారని సమాచారం తో మైలవరం సబ్ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్ దాడి చేసి 9 మంది జుదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 27,680 రూపాయల నగదు, 4 బైక్ లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

నేడు గొల్లపూడిలో ఇథియోపియా బృందం పర్యటన

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో ఈ నెల 20న ఇథియోపియా బృందం పర్యటించనున్నట్లు మండల వ్యవసాయాధికారి బత్తిన రంగనాథ్ బాబు తెలిపారు. ఆ దేశం నుంచి వచ్చే ప్రతినిధుల బృందం గొల్లపూడిలోని రైతు భరోసా కేంద్రంలో రైతులతో ముచ్చటించనున్నట్లు తెలిపారు.

రెడ్డిగూడెం మండల విద్యాశాఖ నిర్లక్ష్యం

- కోల్పోయిన పది ఉపాధ్యాయ పోస్టులు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల విద్యాశాఖ నిర్లక్ష్యం కారణంగా మండలంలో గల వివిధ పాఠశాలల్లో కనీసం ఎనిమిది నుంచి పది ఉపాధ్యాయ పోస్టులు కోల్పోయినట్లు తెలుస్తుంది. గతంలో 60 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో మూడో ఉపాధ్యాయ పోస్టును మంజూరు చేశారు. కానీ రాష్ట్రంలో హైస్కూల్‌కి ఒక కిలోమీటరు దూరంలో ఉన్న ప్రైమరీ పాఠశాలలో చదివే 3,4,5 తరగతుల విద్యార్థులను హైస్కూళ్ళలో కలపటం వలన మిగిలిన ఎస్ జి టి ఉపాధ్యాయ పోస్టులను సర్దుబాటు చేసేందుకు ఈ మధ్య జరిగిన ఉపాధ్యాయుల బదిలీల సందర్భంగా 40 మందికి పైగా విద్యార్థులు ఉన్న పాఠశాలకు మూడో ఉపాధ్యాయ పోస్టు కూడా కేటాయించారు. ఇదే విషయాన్ని తెలిపేందుకు జిల్లా విద్యాశాఖ మండల విద్యాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఆయా మండలాల్లో ఉన్న ఖాళీలను తెలిజేయాలని అధికారులు మండల విద్యాశాఖాధికారికి సూచించారు. కానీ రెడ్డిగూడెం మండల విద్యాశాఖ తమ ఉన్నతాధికారుల నుంచి సమాచారం తీసుకోవడం, సమాచారం ఇవ్వడంలో చేసిన నిర్లక్ష్యం కారణంగా రెడ్డిగూడెం మండలానికి రావలసిన సుమారు 8 నుంచి 10 ఉపాధ్యాయ పోస్టులు రాకుండా పోవడంతో మండల విద్యారంగంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఏర్పడింది. పక్కనే ఉన్న విస్సన్నపేట మండలం చంద్రుపట్ల రెండు పాఠశాలల్లో 40 మందికి పైగా విద్యార్థులు ఉంటే ఆ రెండు పాఠశాలల్లో ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులు ఉన్నారు. అదే మండలంలోని ముతరిశిపాలెం,నర్సాపురం, పుట్రేల మొదలైన పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులు పెరిగాయి కానీ రెడ్డిగూడెం మండలంలో మాత్రం ఒక్క పోస్టు కూడా తీసుకొచ్చేందుకు మండల విద్యాశాఖా కసరత్తు చేయలేదని తెలుస్తోంది. ప్రభుత్వ విద్యా రంగాన్ని ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా తయారు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంటే కొందరు అధికారులు బాధ్యతలేనివిధంగ వ్యవహరించడం ఆశ్చర్యంగా ఉంది. రెడ్డిగూడెం మండలంలో కోల్పోయిన ఉపాధ్యాయ పోస్టులను ఎలా సర్దుబాటు చేస్తారో వేచి చూడాల్సిందే.

గతంలో ఉన్న జిఓ ప్రకారమే వ్యవహరించాం : ఎంఇఓ రఘురాం

గతంలో ఉన్న జిఓ ప్రకారం మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉన్నారని, ఉపాధ్యాయుల కొరత లేదని ఎంఇఓ రఘురాం తెలిపారు. మిగతా మండలాల్లో ఎంఇఓ లు మేనేజ్ చేసి ఎక్కువ పోస్టులు తెచ్చుకున్నారనీ అవి ఆయా మండలాల్లో మరలా తొలగిస్తారని ఆయన అన్నారు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

రైతులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ పి.రాజాబాబు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక దష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ స్పందన మీటింగ్ హాల్లో జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఓ ఎం వెంకటేశ్వర్లు, ఆర్డిఓ ఐ కిషోర్ లతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి పలు ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అర్జీదారుల సమస్యలను ఓపికగా ఆలకించి సంబంధిత అధికారులను పిలిపించి అర్జీల పరిష్కారంపై సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని చేపట్టిందని అందులో మెరుగైన పరిష్కార పద్ధతులను అవలంబిస్తూ జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రత్యేకతను సంతరించుకుందన్నారు. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఈనెల 23వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభిస్తు న్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవోలు తహసీల్దారులు మున్సిపల్ కమిషనర్లతో కొన్ని టాస్క్ ఫోర్స్ కమిటీలు వేసామన్నారు. ప్రతి ఇంటిలో ఉన్న సమస్యలను ముందే వాలంటీర్ల ద్వారా తెలుసుకొని టోకెన్లు ఇస్తామన్నారు. నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సచివాలయాల పరిధిలో అధికారులు అందుబాటులో ఉంటారని అక్కడే ప్రజలకు కావలసిన వివిధ రకాల కులము, ఆదాయము, విద్య, జనన మరణ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి పీఎస్ఆర్ ప్రసాద్, డ్వామా పిడి జివి సూర్యనారాయణ, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, మున్సిపల్ కమిషనర్ చంద్రయ్య, డిపిఓ నాగేశ్వర్ నాయక్, డీఎస్ఓ పార్వతి, ముడా విసి రాజ్యాలక్ష్మి, సిపిఓ వై శ్రీలత, డిఎంహెచ్ఓ డాక్టర్ గీతా బాయి, డిఈఓ తాహెరా సుల్తానా, భూ సర్వే రికార్డుల ఏడి గోపాలకష్ణ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

19 సంవత్సరాల అర్జీ పరిష్కారించిన కలెక్టర్

గత 19 సంవత్సరాలుగా పంట నష్టపరిహారం కోసం ప్రభుత్వాన్ని వేడుకుంటున్న రైతుకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. సోమవారం నగరంలోని కలెక్టరేట్ స్పందన మీటింగ్ హాల్లో స్పందన కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు15 వేల రూపాయల చెక్కును రైతు బసవపూర్ణయ్యకు అందజేశారు. మోపిదేవి మండలం కోసూరు వారి పాలెం గ్రామానికి చెందిన రైతు భోగిరెడ్డి బసవపూర్ణయ్య 2004 లో ఆరు ఎకరాలలో బంగాళా దుంప, కాకర పందిరి, వంగ వంటి పంటలు వేసి వర్షా కాలంలో కురిసిన వర్షాలకు పంట దెబ్బతిన్నగా ఆ పంటకు నష్ట పరిహారం ఇవ్వాలంటూ అప్పటినుంచి ఉద్యాన శాఖకు, కలెక్టర్ కు, ముఖ్యమంత్రి కార్యాలయంకు పలుసార్లు అర్జీలపై అర్జీలు పెడుతూ వస్తున్నారు. వర్షాకాలంలో వచ్చిన వర్షాలకు పంటనష్టం రాదని తెలిసినప్పటికీ అర్జీదారు గత 19 సంవత్సరాలుగా పలుమార్లు ప్రభుత్వం చుట్టూ తిరుగుతూ మళ్లీ మళ్లీ నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతున్నారని జిల్లా కలెక్టర్ మానవత్వంతో ప్రత్యేక విషయంగా పరిగణించి అతనితో మాట్లాడి రు. 15000ల బ్యాంకు చెక్ ను అందించి ఆదుకున్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఓ ఎం వెంకటేశ్వర్లు, ఆర్డిఓ కిషోర్, జిల్లా ఉద్యాన అధికారి జే. జ్యోతి తదితర అధికారులు పాల్గొన్నారు.

30న ధర్నాను జయప్రదం చేయాలి : రైతుసంఘం

ప్రజాశక్తి-ఉయ్యూరు : రైతాంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈనెల 30వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ దగ్గర ధర్నా జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. ఉయ్యూరులోనే స్థానిక శ్రామిక భవనం విలేకరుల సమావేశంలో గౌరిశెట్టి నాగేశ్వరావు మాట్లాడుతూ రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెనకబడి ఉన్నారని ఆరోపించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు దివాలా తీస్తున్నారని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సమస్యలు పరిష్కారం చేయాలని ఆయన అన్నారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయానికి సాగునీరు పరుదలకై కాలవలను పూడికలను తీయించి దిగు స్థాయికి సాగునీరు అందించాలని ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే కొన్ని మండల కేంద్రాల్లో గ్రామాల్లో వ్యవసాయానికి సాగు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ప్రభుత్వం స్పందించి కాలువకు మరమ్మతులు చేపించాలని కోరారు. రైతులకు ఖరీఫ్ సాగు కి పురుగుమందులు విత్తనాలు వంటి సబ్సిడీలు కే రైతులకి అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు అన్నే సుబ్బారావు వి శివశంకర్ సిహెచ్ శ్రీహరి జీవి శాస్త్రి కె రామకష్ణారెడ్డి వై వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికలు

ప్రజాశక్తి-గన్నవరం : ఆంధ్రప్రదేశ్ క్రీడాపాఠశాలలో ప్రవేశం కొరకు గన్నవరం మండలస్థాయి ఎంపికలను ఈ నెల 20 వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు బాలుర ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిక కమిటీ కన్వీనర్ దనాల నాగరాజు పత్రికలకు సోమవారం తెలిపారు. ఆశక్తి కలిగిన బాలబాలికలు 4వ తరగతిలో ప్రవేశం పొందేవారు 3వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, విద్యార్థుల వయస్సు 8నుండి 9 ఏళ్ళ లోపు ఉండి 01/08/2014 టు 31/07/2015మధ్య జన్మించి ఉండాలన్నారు. 5వ తరగతి ప్రవేశాలు పొందేవారు 4వ తరగతి పూర్తి చేసి ఉండాలని, వయస్సు 9నుండి 10 ఏళ్ళ లోపు ఉండి 01/08/2013 టు 31/07/2014 మధ్యన జన్మించినవారై ఉండాలని నాగరాజు తెలిపారు. ఎంపికా సమయానికి ఆధార్, పుట్టిన తేదీ, ప్రధానోపాధ్యాయులు జారీచేసిన 3వ మరియు 4 వ తరగతి స్టడీ మరియు కాండక్ట్ పత్రాలు, కుల ఆదాయ, నివాస ధవీకరణ పత్రాలు, 6 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావాలని నాగరాజు తెలిపారు.

1 నుంచి అరుణాచలంకు బస్సు సర్వీసులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు నుండి అరుణాచలం గిరిప్రదక్షిణకు జూలై 1 నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. 1వ తేదీ రాత్రి 8 గంటలకు డిపో నుండి బయలుదేరి 2వ తేదీ శ్రీకాళ హస్తి దర్శనం, మధ్యాహ్నం కాణిపాకం వినాయకస్వామిని దర్శించుకుని సాయంత్రం శ్రీపురం(గోల్డెన్‌టెంపుల్) దర్శనం అనంతరం అదేరోజు రాత్రి అరుణా చేరుకుంటారని తెలిపారు. 3వ తేదీ గురుపౌర్ణమి, ఆషాఢపౌర్ణమి సందర్భంగా గి ప్రదక్షిణం దర్శనం చేసుకుని 4న ఉయ్యూరు చేరుకుంటారని తెలిపారు. టికెట్ ధర రూ.2,700 కాగా రానుపోను ఖర్చులు ఎవరికి వారే భరించవలసి ఉంటుందన్నారు. సర్వీస్ నంబరు 95599 ద్వారా ఆన్లైన్ రిజర్వేషన్ సౌకర్యం కలదని వివరాలకు 7382893468 సెల్ నంబరుకు సంప్రదించవచ్చని ఉయ్యూరు పరిసర ప్రాంతాల వారు. ఈసౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

సాయం అందిస్తున్న దృశ్యం

అంత్యక్రియలకు సాయం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వడ్ల మన్నాడు గ్రామానికి చెందిన పెన్నేరు సుభాషిని సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. ప్రభుత్వ అందిస్తున్న తక్షణ సహాయం కింద పదివేల రూపాయలను ఆమె కుమారుడు పెన్నేరు పవన్‌కు దహన సంస్కారాల నిమిత్తం అందజేశారు .గ్రామ ప్రముఖులు పెన్నేరు ప్రభాకరరావు, సచివాలయ సంక్షేమ కార్యదర్శి ప్రియాంక, వాలంటీర్ వీళ్ళ జ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌లు పంపిణీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు ఆర్టీసీ డిపో పరిధిలో పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు బస్ పాసులు జారీ ప్రక్రియ ప్రారంభించినట్లు డిపోమేనేజర్ కెవిఎస్ఆర్కె ప్రసాద్ సోమవారం ఓ ప్రకటన లో తెలిపారు. పదవతరగతి వరకు బాలికలకు, 12 ఏళ్లలోపు బాలురకు నివాస స్థలం నుంచి పాఠశాలకు 20 కిలోమీటర్ల దూరం వరకు ఉచితంగా బస్సుపాస్లు అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు పాఠశాల నుండి స్టడీ సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్ కాపీ, రెండు పాస్ పోర్ట్ సై జు ఫోటోలతో బస్ స్టాండ్లలో సంప్రదించాలన్నారు. రూ.50 చెల్లించి 2024 ఏప్రిల్ 30 వరకు చెల్లుబాటయ్యే ఉచిత బస్పాస్ తీసుకోవాలని సూచించారు. హైస్కూల్, కళాశాల విద్యార్థులు మాత్రం మూడవ వంతు చార్జీ చెల్లించి రాయితీ పాస్ పొందవచ్చని తెలిపారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని వినతి

ప్రజాశక్తి కల్కటరేట్ (కృష్ణా) : జిల్లాలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణ (రెగ్యుల రైజేషన్) చేయాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం పార్టీ టియన్‌టియుసి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ టిఎన్టియుసి విభాగం నియోజక వర్గ అధ్యక్షుడు చిన్నం శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ 2023 జూన్ 7వ తేదీన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో 2014 జూన్ 2వ తేదీ నాటికి 5 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న 10,117 మంది కాంట్రాక్ట్ కార్మికులను మాత్రమే క్రమబద్ధీకరణ (రెగ్యులరైజేషన్) చేస్తున్నట్లు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రకటించారని, దీనిని తెలుగుదేశం పార్టీ ఖండిస్తోందన్నారు. ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి పెట్టిన నిబంధనల వలన అనేమంది కాంట్రాక్ట్ కార్మికులు అవుట్ సోర్సింగ్ కార్మికులు నష్టపోతున్నరన్నారు. కనుక నిబంధనలు తొలగించి అందరిని రెగ్యులర్ చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తి.యన్.టి.యు.సి. నాయ కులు పంచపర్వాల కాశీ విశ్వ నాథ్, పట్టణ అధ్యక్షుడు రాగి చంద్రి, రామగాని రత్నా రావు, అడపా రత్నా కర్, వన రాజు, లోగిశెట్టి స్వామీ పాల్గొన్నారు.

యంఈఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

గన్నవరం ఎంఇఒగా కమల

ప్రజాశక్తి-గన్నవరం : వీరులపాడు మండలం నుండి పదోన్నతిపై ఎంఈఓ గా గన్నవరం వచ్చిన రావతుల కమల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. యుటిఎఫ్ నాయకులు మరిదు వరప్రసాద్, దాసరి నవ భారతి, రాజబాబు తదితరులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

చల్లపల్లి ఎంఇఒ-2గా వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల విద్యాశాఖ అధికారిగా పరిసే వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యత స్వీకరించారు. మొవ్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై చల్లపల్లి మండల విద్యాశాఖ అధికారిగా నియమితులయ్యారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ప్రమోషన్లలో వెంకటేశ్వరరావు ఎంఈఓ-2 పోస్ట్ సాధించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మండల విద్యాశాఖ అధికారి పరిసే వెంకటేశ్వరావుకు ఆయన కార్యాలయ ఉద్యోగులు, సీఆర్పీలు సత్కరించి స్వాగతం పలికారు.

పెడన ఎంఇఒ-2గా హరనాథ్

ప్రజాశక్తి పెడన : పెడన మండలానికి ఎంఈఓ-2గా హరనాథ్ బాధ్యతలు సోమవారం చేపట్టారు. ఆదివారం విజయవాడ లో జరిగిన కౌన్సెలింగ్ లో పెడనకు ఎంఇఒ-2 హరనాథ్ ఎంపిక చేసుకున్నారు. హరనాథ్ మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గుండుపాలెం ప్రధానోపాధ్యా యులుగా పనిచేస్తున్నారు.

జగనన్న ఆణిముత్యాల నగదు పంపిణీ

బందరు మండలం తాళ్లపాలెంలో బహుమతులు అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : బందరు మండలం తాళ్ళపాలెం జెడ్పి హైస్కూల్లో జగనన్న ఆణిముత్యాలు ప్రతిభా పురస్కారాలు కింది ముగ్గురు అర్హత కలిగిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నగదు బహుమతులను సోమవారం అందజేశారు. అర్హత కలిగిన విద్యార్థులలో మొదటి బహుమతి వై సామ్యూల్ రూ. 3000 నగదు బహుమతిని, రెండవ బహుమతి ఈ వై నాగరమ్య రూ.2000 నగదు బహుమతిని, మూడవ బహుమతి ఎం యేశోధర్ రూ. 1000 నగదు బహుమతిని, ప్రశంసాపత్రం, మెడల్ ను తాళ్ళపాలెం సర్పంచ్ ఎం. అశ్విని చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదవుకొని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆశీర్వదించారు. పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు డివివి సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది, నాన్ టీచింగ్ సిబ్బంది, పాల్గొన్నారు. ప్రజాశక్తి గుడ్లవల్లేరు : జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగలూరు, కవుతరం, జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక ప్రతిభ కనబరిచిన ప్రథమ ద్వితీయ తతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థిని, విద్యార్థులకు నగదు, బంగారు, రజిత పథకాలను సోమవారం అందజేశారు. అంగలూరు ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో ప్రథమ బహుమతి సిహెచ్ చైతన్యపల్లి, ద్వితీయ బహుమతి ఐకా కావ్య, తతీయ బహుమతి ఎం మేఘన కు అందజేశారు. కవుతరం జిల్లా పరిషత్ హై స్కూల్ లో పి సిరి కుమారి ప్రథమ బహుమతి, సిహెచ్ స్వరూప్ కు ద్వితీయ బహుమతి, ఖాలిక్ కు తతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగలూరు ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు త్రిపుర సుందరీ దేవి ,గ్రామ సర్పంచ్ ఎం రవి, ఉప సర్పంచ్ త్రిపురనేని సురేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- గ్రామ, వార్డు సచివాలయాల పర్యవేక్షణ రాష్ట్ర డైరెక్టర్ లక్ష్మి షా

ప్రజాశక్తి-కంచికచర్ల : ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సచివాలయాల్లోనే తీసుకువచ్చిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాల పర్యవేక్షణ రాష్ట్ర డైరెక్టర్ లక్ష్మి షా అన్నారు. కంచికచర్ల మండలం పరిటాలలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన సచివాలయాల ద్వారా జరిగే రిజిస్ట్రేషన్ ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. పరిటాల గ్రామ రెవెన్యూ పరిధిలో భూముల రీ సర్వే పూర్తయి, సచివాలయం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల ద్వారా ఇంటి ముంగిటికే పాలన వ్యవస్థను తీసుకువచ్చిన ప్రభుత్వం తాజాగా రిజిస్ట్రేషన్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు.. దేశంలో ఇప్పటివరకు ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అందుబాటులోకి వచ్చిన ఈ ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు పొందవచ్చని సూచించారు. ఈ సచివాలయాల్లో అన్ని రకాల దస్తావేజులు, వ్యవసాయ భూములు, వీలునామాలు, దత్తత మొదలైన రిజిస్ట్రేషన్లను చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ వియస్ఆర్ ప్రసాద్, కంచికచర్ల సబ్ రిజిస్ట్రార్ బి శ్రీనివాస్, ఎంపిడిఓ బాలశంకర్ తాహసీల్దార్ శంకర్ బాబు, సర్పంచ్ యద్దనపూడి ఆనందజ్యోష్ణ, కార్యదర్శి ఖదీర్ మీర్జా వలి, ఎంపిటిసి కర్ల రాధిక, చింతా రవి మార్తా శ్రీనివాసరావు కర్ల రామకష్ణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పత్రాలు లబ్ధిదారులకు అందజేస్తున్న లక్ష్మి షా

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

'పోలవరం పోరుకేక' గోడపత్రికలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరువూరు : పోలవరంలో లక్షలాది మంది నిర్వాసితుల సమస్యలపరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 20న భద్రాచలం దగ్గరలోని ఏరుపాక గ్రామం నుండి ప్రారంభమవుతున్న పోలవరం పోరుకేక పాదయాత్ర గోడపపత్రికలను తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఆవిష్కరించారు. పోలవ రం ముంపుప్రాంతాలలో పాదయాత్ర చేసుకుంటూ జులై 4వ తేదీన విజ య వాడకు చేరుకుం టుందని సిపిఎం ఎన్టీ ఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మే కల నాగేంద్రప్రసాద్ తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసి తులను గాలికి వదిలేశాయని ఆవేద వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా లైడర్ సర్వే పేరుతో మరో 36 గ్రామాల ను అదనంగా ముప్పు ప్రాంతంలో చేర్చిందన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గుళ్లపల్లి వెంకటర త్నం, పట్టణ నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఎ.రవి, ఎస్.వి. భద్రం, సాంబారు వెంకటేశ్వర్లు, కె.వెంక టరత్నం, ఎం.ప్రకాశరావు, కోడె రాంబా బు, షేక్ నాగు ల్ మీరా, పాకాల రామ కష్ణ, తదితరులు పాల్గొన్నారు

'సేవాగుణమే పరమార్థం' లఘు చిత్రం ప్రారంభం

ప్రజాశక్తి-మైలవరం : మానవీయ సంబంధాలు, ఒకరికి మరొకరు సాయం చేయడమే అర్థం, పరమార్థం అనే సందేశంతో శివసాయి బాలాజీ మూవీ మేకర్స్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.6 షార్ట్ ఫిలిం షూటింగ్ ప్రారంభమైంది. సోమవారం షార్ట్ ఫిలిం యూనిట్ షూటింగ్ వివరాలను మీడియాకు వివరించారు. నేటి సమాజంలో మానవతా విలువలు నశించాయని, ఆర్థిక ఇబ్బందులు కారణంగా కొంతమంది బిచ్చగాళ్ళు గా, దొంగలుగా మారుతున్నారని, కొంతమంది మహిళలు వేశ్య వత్తిలోకి బలవంతంగా నెట్టబడు తున్నారన్నారు. మనిషిగా పుట్టినందుకు సేవ యొక్క అర్థం, పరమార్థం అన్న సందేశం తో కూడిన కథాంశాన్ని ఎంచుకొని ఈ లఘు చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు యూనిట్ తెలియజేసింది. ఇప్పటివరకు చిత్రీకరించిన లఘు చిత్రాలన్నింటిని త్వరలో మైలవరం మాయాబజార్ లో అనే యూట్యూబ్ ఛానల్ లో ప్రసారం చేయనున్నట్లు వివరించారు. ఈ ఛానల్ ను ద్వారకాతిరుమల దేవస్థానం పర్య ధర్మకర్త, మైలవరం జమిందార్ ఎస్వీ సుధాకర్ రావు ప్రారంభించనున్నారని వారు తెలియజేశారు.

అనధికారికంగా ఎరువులు విక్రయిస్తే చర్యలు :ఎఒ

ప్రజాశక్తి - తిరువూరు : ఎరువులు స్టాక్ రాగానే తమ కార్యాలయానికి తెలియచేయాలని, స్టాక్ రిజిస్ట ర్లు ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని తిరువూరు మండల వ్యవసాయ అధి కారిణి(ఎఒ) పద్మ తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో సోమవారం మం డలంలోని ఎరువులు, పురుగు మందు ల రిటైలర్ డీలర్లతో ఎఒ సమావేశం నిర్వహించారు. స్టాక్ బోర్డ్ లో స్టాక్ నిల్వ, ధరలను ప్రతిరోజు అప్డేట్ చేయాలన్నారు. అనధికారికంగా ఎరు వులు, పురుగు మందులు అమ్మ కూడదని, అమ్మినచో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరిం చారు. ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరిగా బిల్లు ఇచ్చి, బిల్లుపై రైతు సంత కం తీసుకోవాలని తెలిపారు. ఎరువు లు, పురుగు మందులు అధిక ధరలకు అమ్మకూడదని తెలిపారు. ఎరువుల సోర్స్ సర్టిఫికెట్ కచ్చితంగా లైసెన్స్ లో పొందుపరచి ఉంచాలని తెలిపారు.

మల్లాది శ్వేత కు సత్కారం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణము రెండవ వార్డు నందు నీట్ ఎగ్జామ్స్ లో 720/595 మార్కులను మల్లాది బెన్ని కిషోర్ లత ల కుమార్తె మల్లాది శ్వేత సాధించింది. సోమవారం మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్వగహంలో స్థానిక తెదేపా నేతలు తల్లిదండ్రులు వారి కుటుంబ సభ్యులతో కలసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏచూరి రాము పాల్గొన్నారు.

పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించాలి : సిపిఎం

నందిగామలో...

వన్‌టౌన్‌లో...

ప్రజాశక్తి- నందిగామ : రాష్ట్ర ప్రభుత్వం కరెంట్ భారాలు తగ్గించాలని సోమవారం నందిగామ 18 వ వార్డులో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చనుమోలు సైదులు, కే గోపాల్ మాట్లాడుతూ ప్రజల కళ్ళు కప్పి దొడ్డిదారిన సర్దుబాటు చార్జీల భారం రానున్న స్మార్ట్ మీటర్లతో మరో ముప్పు పొంచి ఉందన్నారు. మాట తప్పిన జగన్ ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పెంపుదలను ప్రతిఘటించాలన్నారు. వైసీపీ ప్రజా ప్రతినిధులను నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నందిగామ కమిటీ సభ్యులు సయ్యద్ ఖాసీం , జంగా దామోదర్, ఉప్పు పుల్లయ్య, ధాన ,ఉప్పుతోళ్ల స్వామి, ఉప్పు శ్రీను, రోశయ్య .తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-భవానీపురం** : విద్యుత్ సర్దుబాటు చార్జీలు, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం కొత్తపేట కుమరవీధులలో ఇంటింటికి విద్యుత్ పోరుబాట కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయవాడ పశ్చిమ నగర సిపిఎం కార్యదర్శి బి. సత్యబాబు మాట్లాడుతూ ఇంటి అద్దెలుతోపాటు ఈ కరెంటు బిల్లు భారం భరించలేని విధంగా ఉందని అన్నారు. తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో అంబానీ, అదానీలకు మేలుజరిగిందని, సామాన్యులపై మాత్రం మోయలేని భారాలు వేశారని దుయ్యబట్టారు. విద్యుత్ సంస్కరణ పేరుతో ఆదాని కంపెనీలకు లాభాలు ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు విద్యుత్తు సర్దుబాటు భారాలు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నగర నాయకులు కే సూరిబాబు. ఎం రూపేష్. సుదర్శన్. శ్రీధర్ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే మట్టి తవ్వకాలు : వైసిపి

ప్రజాశక్తి-మైలవరం : జి.కొండూరు మండలం చిన్న నందిగామలో నిబంధనల ప్రకారమే మట్టి తోలుకాలు జరుగుతున్నాయని, గ్రామాభివృద్ధిని అడ్డుకునే వారే పసలేని ఆరోపణలు చేస్తున్నారని గ్రామ అభివద్ధి కమిటీ చైర్మన్ పొన్నగంటి శివనాగేశ్వరరావు, చెరువు అభివద్ధి కమిటీ చైర్మన్ వల్లూరు రామ్ సురేష్ అన్నారు.చిన్న నందిగామలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రైతులకు గ్రామస్తులకు అవసరాల మేరకు మట్టి తోలుతున్నవే తప్ప ఎక్కడ అవినీతికి ఆస్కారం లేదన్నారు. మట్టి తొలకాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని పశువైద్యశాల, రామాలయం, బొడ్డురాయి,గ్రామంలో అపస్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి నిధులను ఉపయోగిస్తున్నామన్నారు. పెద్ద చెరువు అభివద్ధి కమిటీ గ్రామ అభివద్ధి కమిటీల పర్యవేక్షణలో మట్టి తోలకలు ద్వారా వచ్చిన ఆదాయాన్ని కోడూరు గ్రామంలోని జాతీయ బ్యాంకులో జమ చేస్తున్నామన్నారు. గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ అభివద్ధిని అడ్డుకుంటూ మట్టి తోలకాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని తమకు ఇవ్వాలని సర్పంచ్ డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మద్దాల వెంకటేశ్వరరావు, గరిమెళ్ళ నాగేశ్వరరావు, పెండం రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని చెరువు కట్టమీద ఉన్న ఆంజనేయ స్వామి వారి దేవాలయం సమీపంలో ఊర చెరువు అలుగు వద్ద 30 లక్షల రూపాయలతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ 13, 15 వార్డుల ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేందుకే 30 లక్షల రూపాయలతో ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. గతంలో ఈ బ్రిడ్జి రెండు మీటర్ల వెడల్పుతో ఇరుకుగా ఉండి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఉండేవని అన్నారు. స్థానికుల అభ్యర్థనతో పాటు స్థానిక నాయకుల సూచనల మేరకు ఈ బ్రిడ్జి నిర్మాణం మరింత పొడవు, వెడల్పులతో విశాలమైన బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు తన్నీరు నాగేంద్ర పాల్గొన్నారు.

నేటి కౌన్సిల్ సమావేశంపై ఉత్కంఠ

ప్రజాశక్తి - తిరువూరు : మంగళవారం జరగనున్న తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశానికి ఉత్కంఠత నెలకొననుంది. పాలకపక్షంలో విభేదాలు నెలకొనడంతో గత నెల లో జరిగిన కౌన్సిల సమావేశానికి పాల క వర్గానికి చెందిన 17 మంది కౌన్సిలర్లలో 8 మంది హాజరుకాకపోవటంతో కోరంలేక చైర్‌పర్సన్ సమా వేశం వాయిదా వేశారు. ఒప్పం దం ప్రకారం చైర్ పర్సన్ పదవీ కాలం రెండే ళ్లు మార్చితో ముగిసింది. అయినా నేటివరకు ఒప్పందం అమలుకా చేయ కపోవడం, రెండేళ్లు తరు వాత మేము రాజీనామా చేస్తామనే ఒప్పందం జరగ లేదని చైర్‌పర్సన్ చెప్పటంతో వ్యతిరే క వర్గం గుర్రుగా ఉంటూ సోమవారం జరిగే కౌన్సిల్ సమావేశానికి కూడా గైర్హాజర్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

'జగనన్న సురక్ష' పై సమీక్ష

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణ పురపాలక సంఘ కౌన్సిల్ హాల్‌లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం పై సంబందించి సచివాలయ కార్యదర్శులు, నోడల్ ఆఫీసర్ల తో మున్సిపల్ కమిషనర్ సిహెచ్. మల్లేశ్వర రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 23 నుండి 30 వరకు వాలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు వారి పరిధిలో ఉన్న ప్రతి గృహం సందర్శించి వివిధ పథకాల కింద అర్హులై ఉండి లబ్ది పొందని అర్హుల పత్రాలు పరిశీలించి నమోదు చేయాలన్నారు. జూలై 1 నుండి 18 వరకు సచివాలయం వద్ద ఉదయం 9 గంటల ల నుండి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. ఈ క్యాంపులో నోడల్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్ళి సేకరించిన పత్రాలను పరిశీలించి అర్హులను గుర్తించి అదే రోజున కుల, ఆదాయ, జనన-మరణ మొదలగు పత్రాలు అందజేయాలని కోరారు.

అనారోగ్యంతో వత్సవాయి ఎంపిపి మృతి

ప్రజాశక్తి-వత్సవాయి : వత్సవాయి మండలం, దబ్బాకుపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వత్సవాయి మండల ఎంపీపీ చెంబేటి వెంకటేశ్వరరావు సోమవారం తెల్లవారుజామున అనారోగ్య కారణంగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ సామినేని ఉదయభాను దబ్బకుపల్లి లోని వారి స్వగహానికి వెళ్లి వారి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఎంపీపీగా ఆయన చేసిన సేవలు,వత్సవాయి మండలం అభివద్ధికి ఆయన చేసిన కషిని కొనియాడారు. పలువురు నాయకులు మతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు వేల్పుల రవికుమార్, పోలంపల్లి సొసైటీ అధ్యక్షులు కాటేపల్లి రవికుమార్, డబ్బాకుపల్లి సొసైటీ అధ్యక్షులు పండగ శ్రీనివాసరావు, వత్సవాయి జెడ్పిటిసి ఏసుపోగు శ్రీనివాసరావు దేవమని, మండల పార్టీ అధ్యక్షులు గాదల రామారావు, ఎక్స్ ఎంపీపీ రూప్లనాయక్, మారెళ్ళ సూరారెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ప్రముఖ సినియర్ న్యాయవాది కాసరగడ్డ నాగేశ్వరరావు, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు సిరిమామిళ్ల హనుమంతరావు, ఎస్కె నాగూల్‌మీరా, బి. రాము, భూక్యరాజా నాయక్, సయ్యద్ బాబు, కనగాల రమేష్, మండల సమైక్య అధ్యక్షురాలు గంగ పోగు శిరీష రమేష్ వాసిరెడ్డి నాగేశ్వరావు, భీమవరం సర్పంచి బీమాల వెంకట సుజాత, డబ్బాకుపల్లి సర్పంచి కొట్టే నాగేశ్వరరావు, మండల పరిషత్తు సిబ్బంది పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నివాళులర్పిస్తున్న సామినేని ఉదయభాను

చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

కలెక్టరేట్ ఎదుట ఎపి చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా), గూడూరు

మాస్టర్ వీవర్ల , చేనేత సొసైటీల వద్ద నిల్వవున్న చేనేత వస్త్రాలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్‌చేస్తూ ఆంధ్రప్రదేశ్ చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలక్టరేట్ ధర్నా చౌక్‌లో ధర్నా

ధర్నాలో పాల్గొన్న చేనేత కార్మికులు

నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కట్టా హేమ సుందరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని చేనేత నేతన్నలు ప్రస్తుతం చాలినంత పని లభించక, కుటుంబ పోషణ దుర్భరమై అర్థాకలికీ, 'ఆకలి చావులకూ, ఆత్మహత్యలకూ బలైపోతున్నారన్నారు. చేనేత వృత్తి, పరిశ్రమ నేడు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో ప్రభుత్వ సహాయ సహకారాలు చాలా అవసరమన్నారు. ప్రభుత్వం 'నేతన్న నేస్తం' పథకం కింద మగ్గాలున్న చేనేత కార్మికులకు రూ.24 వేలు సంవత్సరానికి ఆర్థిక సహాయం సమకూర్చుతున్నందుకు ధన్యవాదాలని తెలిపారు. ఆ పథకాన్ని నేతన్నలందరికీ వర్తింపచేయాలనీ, షెడ్డుల్లో నేత నేస్తోన్న కార్మికులకూ, చేనేత ఉప వత్తుల కార్మికులకు కూడా అందజేయాలని డిమాండ్ చేశారు. మాస్టర్ వీవర్ల వద్ద చేనేత వస్త్రాలు నిల్వవుండి పోవడం రాష్ట్రంలోని వివిధ చేనేత కేంద్రాల్లో నేత నేస్తోన్న కార్మికులకు ప్రస్తుతం చాలినంత పని లభించడం లేదన్నారు.. మాస్టర్ వీవర్ల వద్ద, చేనేత సహకార సంఘాల వద్ద నిల్వ ఉండిపోయిన చేనేత వస్త్రాలను రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేస్తోన్న విధంగానే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పంచల నరసింహారావు మాట్లాడుతూ మాస్టర్ వీవర్లు, చేనేత సొసైటీల వద్ద నిల్వవున్న చేనేత వస్త్రాలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి వీవర్లు, సొసైటీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చేనేతకు 11 రకాల వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు జరపాలన్నారు. ఉల్లంఘించిన వారిపై చట్టం (1985) ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. చేనేతపైన జీఎస్‌టీని పూర్తిగా రద్దు చేయాలనీ, రాష్ట్ర ప్రభుత్వం 2023-24 వార్షిక బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించాలనీ, రూ.25 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు విద్యా సంస్థలతో సహా, అన్ని ప్రభుత్వ సంస్థల్లో చేనేత వస్త్రాలనే వినియోగించేల ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. నూలు, పట్టు, జరీ, రంగులు, రసాయనాల ధరలు 2021 నాటి స్థాయికి తగ్గించాలని, చేనేత సహకార సంఘాలకు చెల్లించవలసిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని , ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి 3 సెంట్ల స్థలం మంజూరుచేసి హౌస్-కమ్ వర్క్ షెడ్ ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలన్నారు. చేనేత షెడ్డులపైన ప్రభుత్వం వసూలు చేస్తున్న కమర్షియల్ టాక్స్‌ని రద్దు చేయాలన్నారు. ఆప్కో ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వాసా గంగాధరరావు, పడవల కోటిలింగం, పి.సుందరరావు, జె.ఉమామహేశ్వరావు, పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు. ఈ ధర్నాకు సిపిఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, సీఐటియు నాయకులు, తాతయ్య, మోదిమూడి రామారావు సంఘీభావం తెలిపారు.

కొవ్వొత్తులతో టిడిపి నిరసన

ప్రజాశక్తి-అవనిగడ్డ

బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పల వారి పాలెం లో అమర్నాథ్ హత్యను ఖండిస్తూ టిడిపి ఆధ్వర్యంలో సోమవారం అవనిగడ్డ పార్టీ కార్యాలయం నుండి కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రం అరాచక శక్తులకు అడ్డాగా తయారైందన్నారు. నేరాలకు పాల్పడుతున్న వారిని కఠినంగా అణిచివేయడంతో పాటు అమర్నాథ్ హత్యకు కారకులైన వెంకటేశ్వర రెడ్డి, అతని అనుచరులను తక్షణమే అరెస్టు చేసి

కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, బండి రాఘవ, రావి రత్నగిరి, ఘంటసాల రాజమోహనరావు, అన్నపురెడ్డి లక్ష్మీనారాయణ, లుక్కా వెంకట పిచ్చయ్య, బచ్చు రఘునాథ్, చెన్ను గాంధీ, నలుకుర్తి వెంకటరావు, బర్మా శ్రీనివాసరావు, గుంటూరు విజయ్, చెన్ను బాబురావు, లింగం బాబురావు, మెగావత్ గోపి, పుల్లగోరు రాజేంద్రరావు, లుక్కా మల్లేశ్వరరావు, గుగ్గిలం శ్యాం కుమార్, తండు గంగాధర్, యలవర్తి చిన్న, పరిమిశెట్టి శేఖర్, రేపల్లె అంకినీడు తదితరులు పాల్గొన్నారు.

నేర చరిత్రకు పరాకాష్ట : బుద్ధ ప్రసాద్

బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పల వారి పాలెం లో పదో తరగతి విద్యార్థి అమర్నాథ్ అనే బిసి విద్యార్థి పై వైసిపి కార్యకర్తలు అతి కిరాతకంగా పెట్రోల్ పోసి హత్య చేయటం వైసిపి ప్రభుత్వం నేర చరిత్రకు పరాకాష్ట అని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ విమర్శించారు. నా బీసీలు నా ఎస్సీలు అని ఉపన్యాసం చెప్పే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కనీసం సంఘటన స్థలాన్ని కూడా ఎందుకు సందర్శించలేదని ప్రశ్నించారు.

దేశ చరిత్రలోనే దిగ్భ్రాంతి గురిచేసిన దుస్సంఘటన జరిగితే సరైన రీతిలో ముఖ్యమంత్రి స్పందించకపోవడం ప్రభుత్వ పోకడకు అద్దం పడుతోందన్నారు. నియోజకవర్గంలో మట్టి ఇసుక అక్రమ తవ్వకాలపైనే తన పోరాటం పాలన వ్యవస్థ పై తప్పు వ్యక్తుల మీద కాదని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు.

తెలుగు యువత సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-ఉయ్యూరు

సమాజంలో తెలుగు యువత సేవలు అభినందనీయమని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు అన్నారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి డీజేఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా కాటూరు అంబేద్కర్ నగర్ కమ్యూనిటీ షెల్టర్‌కు రూ.10వేల ఆర్థిక సాయం మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజసేవలో తెలుగుయువత అనునిత్యం ముందంజలో ఉంటోందన్నారు. యువత నాయకుడు చౌదరి చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. వైసీపీ ప్రభుత్వ అరాచక, అవినీతి పాలన యువతలో ఎండగట్టి తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చే యువకులతో పాటు అన్నివర్గాల ప్రజలకు కలిగే ప్రయోజనాలు వివరించాలన్నారు. పార్టీ నాయకులు యుగబాబు తదితరులు పాల్గొన్నారు.

వైవీబీకి వీరమ్మ ఆలయ కమిటీ పరామర్శ

ప్రజాశక్తి-ఉయ్యూరు

తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ ను వీరమ్మ ఆలయ కమిటీ సభ్యులు సోమవారం కలసి పరామర్శించారు. అనారోగ్యంతో ఇటీవల విజయవాడ రమేష్ హాస్పిటల్లో చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న రాజేంద్రప్రసాద్‌ను వీరమ్మ ఆలయ కమిటీ సభ్యులు నెరుసు బాలకృష్ణ, పారుపూడి సుబ్బారావు, పారుపూడి ప్రసాద్, నెరుసు గంగాధరరావు, పారుపూడి వెంకటేశ్వరరావు, ఎర్రశీను తదితరులు కలసి ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకుని అమ్మవారి వస్త్రాలు అందజేసి వీరమ్మతల్లి ఆశీస్సులతో త్వరగా కోలుకుని ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు.

రాష్ట్ర జేఏసీ వైస్ చైర్మన్ గా సి.హెచ్.ఎన్ దేవేంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

రాష్ట్ర కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ జేఏసీ వైస్ చైర్మన్‌గా సి.హెచ్.ఎన్ దేవేంద్ర రావును ఎన్నుకున్నారు.

ఆదివారం విజయవాడలో ఎం. బి.వి. విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రంలో ఉన్న అన్ని ఉద్యోగ సంఘాల కాంట్రాక్ట్, అవుట్ నాయకులు, సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలపై జరిగిన సదస్సులో ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో, జేఏసీ చైర్మన్ ఏవి నాగేశ్వరరావు, జనరల్ సెక్రెటరీ బాల కాశి ,బి కాంతారావు, వి విజయకుమార్, విజయ్, నూర్ మహమ్మద్ పాల్గొన్నారు. నూతనంగా వైస్ చైర్మన్ గా ఎన్నికైన సిహెచ్ ఎన్ దేవేంద్రను, జేఏసీ నాయకులు, పలు సంఘాల నాయకులు అభినందించారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం యత్నం

గుడివాడ :అప్పుల బాధ తాళలేక ఆటోడ్రైవర్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం స్థానిక చౌదరిపేటలో నివాసం ఉండే సాలా సుబ్రహ్మణ్యం ఆటో డ్రైవర్గా జీవనం సాగిస్తున్నాడు. తనకు అప్పిచ్చిన వ్యక్తి వేధింపులు తాళలేకనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సెల్ఫీ వీడియోలో సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశాడు. ఆత్మహత్య దృశ్యాలను సెల్ఫీ వీడియో తీసుకొని సోషల్ మీడియాలోపోస్ట్ చేయడంతో విషయం తెలుసుకున్న, సహచర ఆటో డ్రైవర్లు ఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సాలా సుబ్రహ్మణ్యాన్ని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్య చికిత్సలు అందించిన అనంతరం పరిస్థితి విషమించడంతో, మెరుగైన వైద్య నిమిత్తం విజయవాడ తరలించారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

గుడివాడ : దళితుల శ్మశాన వాటిక సమస్యను పరిష్కరించినందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్ర పటానికి వైఎస్ఆర్పిపి ఎస్సీసెల్ అధ్యక్షా, కార్యదర్శులు రేమెల్లి నీలకాంత్(పసి) మామిళ్ళ ఏలిషాల ఆధ్వర్యంలో పాలభిషేకం చేశారు. సోమవారం స్థానిక శరత్ థియేటర్‌లోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గుడివాడ పర్యటనలో పాల్గొన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి, ఎమ్మెల్యే కొడాలి నాని శ్మశాన వాటిక సమస్యను తీసుకెళ్లారు.

చైర్మన్ పదవికి వన్నెతెచ్చిన జోత్స్నారాణి

రాష్ట్ర గృహనిర్మాణశాఖామంత్రి జోగి రమేష్ అభినందన

ప్రజాశక్తి-పెడన

పెడన మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బల్ల జ్ఞాన లింగ జోత్స్నరాణి తన రెండేళ్ల పదవీకాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయటం ద్వారా ఆ పదవికి వన్నె తెచ్చారని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. జోత్స్నారాణి రాజీనామా చేసిన నేపథ్యంలో కౌన్సిల్ ఆమోదం కోసం సోమవారం ఏర్పాటు చేసిన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రెండేళ్ల మూడునెలల కాలంలో పెడన పట్టణానికి ఎంతో అభివృద్ధి చేశారన్నారు. గతంలో మాట ఇచ్చిన ప్రకారం పెడన ఐదేళ్ల మున్సిపల్ చైర్మన్ పదవిని రెండేళ్లపాటు బల్ల జ్యోత్స్నారాణి గంగయ్య, అనంతరం మూడేళ్లపాటు కటకం నాగ కుమారి ప్రసాద్‌లకు కేటాయించాలని గతంలో తీర్మానించామన్నారు. ఆ మాటకు కట్టుబడి చైర్మన్ పదవికి రాజీనామా చేసిన జోత్స్నారాణిని మంత్రి జోగి రమేష్ అభినందించారు. మూడో వార్డు కౌన్సిలర్ బల్ల గంగయ్యను మున్సిపల్ ఫ్లోర్ లీడర్గా నియమించారు. జ్యోత్స్నరాణి మాట్లాడుతూ ఈ రెండు సంవత్సరాల మూడు నెలలు కాల వ్యవధిలో పెడన పట్టణ అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషిచేశానన్నారు. మంత్రి జోగి రమేష్ సహాయ సహకారాలతో అభివృద్ధే ధ్యేయంగా పనిచేశానని చెప్పారు. కరోనా లాంటి కష్ట సమయంలో కూడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా పరిపాలన చేశానని ఆమె గుర్తు చేశారు. బల్ల జ్ఞాన లింగ జోత్స్నారాణి గంగయ్య దంపతులను మంత్రి జోగి రమేష్,

మాట్లాడుతున్న జోగి రమేష్

మరియు, కౌన్సిలర్లంతా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ కాజా, వైస్ చైర్ పర్సన్ బయలపాటి జ్యోతి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కడగం ప్రసాద్, కౌన్సిలర్లు మెట్ల గోపి,సిరివెళ్ల జేయష్, మెట్ల సుబ్రమణ్యం, గరిక ముక్కు చంద్రబాబు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మేలు జరిగేలా సిఎం కృషి : సింహాద్రి

ప్రజాశక్తి-అవనిగడ్డ

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి ఇంటికి మేలు చేస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తెలిపారు.గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని అశ్వరావు పాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు పారదర్శకంగా ప్రతి గడపకు చేరుతున్నాయన్నారు. గ్రామంలోని పలు గహాలను సందర్శించి ప్రభుత్వ పథకాలను వివరించడంతోపాటు వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంచి పాలన అందిస్తున్నారని చెప్పారు. విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు సచివాలయాల ఏర్పాటు వాలంటరీ వ్యవస్థ ద్వారా వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొంగల సుమతీ దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ షేక్ నజీర్ భాష, అవనిగడ్డ పట్టణ పార్టీ కన్వీనర్ అన్నపురెడ్డి రామదాసు, గ్రామ కన్వీనర్ దాసినేని భాగ్యరాజు, సచివాలయ కన్వీనర్ దాసినేని గోపాలకృష్ణ, గ్రామ పార్టీ నాయకులు దాసినేని శ్రీనివాసరావు, కొండవీటి నాగరాజు, రేపల్లె కృష్ణారావు, అవనిగడ్డ మాజీ ఉపసర్పంచ్ గాజుల జయ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరులో ఆప్తా సేవా కన్వెన్షన్

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: అమెరికన్ ప్రొగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1 నుండి 3వ తేదీ వరకు ఆప్త కన్వెన్షన్‌ను టెక్సాస్ నగరంలో నిర్వహించనున్నట్లు ఆప్తా మాజీ అధ్యక్షులు గోపాలకృష్ణ గుడిపాటి తెలిపారు. గుణదలలోని ఓ హోటల్‌లో సోమవారం ఆప్తా కన్వెన్షన్ సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ సంస్థ గత 15 సంవత్సరాల క్రితం అమెరికాలో ఏర్పడిందన్నారు. గత పదిహేను సంవత్సరాలలో రెండు తెలుగు రాష్ట్రాలలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఏటా 1500 మంది విద్యార్థులకు సుమారు రెండు కోట్ల రూపాయలు విలువచేసే ఉపకార వేతనాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కన్వెన్షన్ కన్వీనర్ విజయ్ గుడిసేవ, ఇండియా కో ఆర్డినేటర్ రంగబాబు రంగిశెట్టి, కన్వెన్షన్ పొలిటికల్ ఫోరం అడ్వైజర్ బాబీ, టెక్సాస్ రీజనల్ వైస్ ప్రెసిడెంట్ కిషోర్ అనిశెట్టి, నాగు కొలసాని పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల అభివృద్ధిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామంలో అందించిన జగనన్న పేదలందరికీ ఇళ్ళ పథకం నేటికి సరిగ్గా అమలు కాకపోవడంతో ఇళ్ళ స్థలాల అభివృద్ధిపై ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు ఇబ్రహీంపట్నం ఎంపిపి పాలడుగు జ్యోత్స్న దుర్గాప్రసాద్ విజయవాడలో కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటుపల్లి గ్రామంలో నేటికి నివేశన స్థలాలను అభివృద్ధి చేయకుండా పనులు నిలుపుదల చేశారని తెలిపారు. 475 కుటుంబాలను అ ర్హులుగా గుర్తించినప్పటికి 395 పట్టాలు మంజూరు చేశారు. మిగిలిన 80 కుటుంబాలకు ఇప్పటివరకు పట్టాలు మంజూరు చేయలేదు. మంజూరు చేసిన 395 పట్టాలకు సంబంధించి నివేశన స్థలాల్లో ఇళు ్ళ నిర్మించుకోవడానికి ఎటువంటి అభివృద్ధి జరగలేదని ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులుగా మేము అనేక మార్లు ప్రభుత్వ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు సమస్యను తీసుకువెళ్లినా ప్రయోజనం లేదన్నారు.

విస్తరణ దిశగా కినారా క్యాపిటల్

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ

కినారా క్యాపిటల్ సంస్థ తమ కంపెనీ కార్యకలాపాల విస్తరణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తిరునావుక్కరసు తెలిపారు. నగరంలోని ఓ హొటల్‌లో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో సంస్థ వివరాలను తెలియచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈఆర్థిక సంవత్సరంలో సంస్థ కార్యాకలాపాలను విస్తరిస్తున్నామన్నారు. 2024 ఆర్థిక సంవత్సరంలో 800 కోట్ల రూపాయలకు పైగా వ్యాపార రుణాలను అందించాలని ప్రణాళిక నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, సెమి అర్బన్ ప్రాంతాలలో కూతా తమ సంస్థ సేవలను విస్తరిస్తున్నామని తెలిపారు.

రెండు రైతు బజార్లు ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ: రాష్ట్రంలోని సన్న, చిన్నకారు రైతుల ప్రయోజనాలను దష్టిలో పెట్టుకొని రైతు బజార్ల వ్యవస్థలో నాడు నేడు తరహాలో సంస్కరణలు తీసుకువస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో రెండు రైతుబజార్ల సముదాయాన్ని సోమవారం స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, జాయింట్ కలెక్టర్ డా. పి సంపత్‌కుమార్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. రూ.61.50 లక్షలతో జివిఎస్ రాజు రోడ్డులో 78 దుకాణాలు, సాంబమూర్తి రోడ్డులో రూ.1.03 కోట్లతో 106 దుకాణాలతో కూడిన రైతు బజార్లను మంత్రి ప్రారంభించి మాట్లాడుతూ వినియోగదారులకు తక్కువ ధరలో నిత్యావసరాలు, కూరగాయలు అందించేందుకు, అదే సమయంలో రైతులు తమ పండించిన పంటకు గిట్టుబాటు ధర పొందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నగరంలో మరొక రెండు రైతు బజార్లు నిర్మించేందుకు కార్యాచరణ ప్రణాళిక ఉందని పేర్కొన్నారు. ఖరీఫ్ కోసం ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు ఆర్‌బికెల ద్వారా పంపిణీ చేసేందుకు అవసరమైన ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ ఆవుతు శైలజరెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ బండి పుణ్యశీల, ఏపి ఫైబర్ నెట్ గౌతమ్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ బాలి గోవింద్, జిల్లా మార్కెట్ అధికారి కె.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌ను ప్రారంభిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

రౌడీషీటర్లపై నిఘా పెట్టాలి : డిసిపి

ప్రజాశక్తి-విజయవాడ

నేరాల నియంత్రణకు నగరంలో రౌడీషీటర్లపై మరింత నిఘా పెట్టాలని ఈస్ట్ జోన్ డిసిపి విశాల్ గున్ని పోలీసు అధికారులను ఆదేశించారు. డిసిపి అధ్యక్షతన సోమవారం డిప్యూటి పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంలో ఈస్ట్ జోన్ పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రౌడీషీటర్లు ఎటువంటి నేరాలకు పాల్పడకుండా గ్రేవ్, పొక్సో, ఎస్సీ,ఎస్టీ కేసుల్లో నిర్దేశిత సమయంలోగా చార్జిషీట్ కోర్టులో దాఖలు, మహిళలు, వద్ధులు మిస్సింగ్ కేసులకు సంబంధించి, మద్యం,గంజాయి వంటి అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు మొదలగు అంశాలపై డిసిపి సమీక్షించారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ... గ్రేవ్, పొక్సో, ఎస్సీ,ఎస్టీ కేసుల్లో నిర్దేశిత సమయంలోగా చార్జిషీట్ కోర్టులో దాఖలు చేసి సీసీ నెంబర్లు తొందరగా వచ్చే విధంగా కోర్టు సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. విచారణ సమయంలో సాక్షుల సకాలంలో కోర్టుకు హాజరయ్యి, సాక్ష్యం చెప్పే విధంగా చర్యలు చేపట్టి, నిందితులకు శిక్ష పడే విధంగా చూడాలని, ఎక్కువ సంఖ్యలో క్రైమ్ బీట్ లను నియమించడం, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కేసులను పరిష్కరించడంలో కీలకంగా వ్యవహరించాలని కోరారు. మహిళలు, వద్ధులు మిస్సింగ్ కేసులు మరియు మహిళా సంబంధిత కేసులతోపాటు ముఖ్యమైన కేసులలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ సమావేశంలో క్రైమ్ ఏడిసిపి పి.వెంకటరత్నం, టాస్క్ ఫోర్సు ఏడిసిపి జి.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్టేషన్‌కు కమ్యూనిటీ హాలు భవనం

ప్రజాశక్తి-విజయవాడ: సింగ్‌నగర్ 59వ డవిజన్ రాధానగర్ కమ్యూనిటీ హాలు భవనాన్ని న్యూ ట్రాఫిక్ పోలీస్టేషన్‌కు వినియోగించుకోవడానికి లీజుకిస్తూ స్థాయి సంఘం తీర్మానించింది. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన సోమవారం స్థాయి సంఘం సమావేశం జరిగింది. స్థాయి సంఘంలో ప్రస్తుతం ఉన్న ఈ సభ్యులకు ఇదే చివరి సమావేశం కావడం గమనార్హం. ఎన్‌టిఆర్ పోలీసు కమిషనరేట్ వారు కోరిన దానిపై ...రాధానగర్ కమ్యూనిటీ హాలు భవనాన్ని అద్దె ప్రాతిపదికన కేటాయిస్తూ స్టాండింగ్ కమిటీ తీర్మానించింది. చదరపు అడుగుకు రూ.15 చొప్పున ప్రతి రెండు సంవత్సరాలకు ప్రస్తుతం చెల్లించుచున్న అద్దెపై ఐదు శాతం పెంచుతూ ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం ప్రకారం 2026 వరకు లీజుకిస్తూ తీర్మానించారు. నగరపాలక సంస్థ వెహికల్ డిపో పరిధిలో గతేడాది నుంచి ఇప్పటి వరకు రూ. ఐదు లక్షలకు లోబడి నామినేషన్ పద్ధతిపై ఆఫీసు వారు చేయించిన 44 వర్క్సుకు సంబంధించిన అంశాన్ని ర్యాటిపై చేస్తూ తీర్మానించారు. అలాగే సర్కిల్-1 పరిధిలో గడిచిన ఆర్థిక సంవత్సరంతో పాటు ఈ ఏడాది మే 27 వరకు రూ. ఐదు లక్షలకు లోబడి చేయించిన 151 వర్క్సుకు సంబంధించిన అంశాన్ని ర్యాటిపై చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. వన్‌టౌన్‌లోని కెనాల్ రోడ్డు పార్కింగ్ ప్రదేశం, అలాగే వినాయకుని గుడి వెనుక పార్కింగ్ ప్రదేశంలో ఏడాది పాటు పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునేందుకు రూ. 5.71 లక్షల మేర హెచ్చు మొత్తంలో బహిరంగ వేలంలో చేజిక్కించుకున్న వెన్నంద రజినికుమార్‌కు కేటాయిస్తూ తీర్మానించారు. సర్కిల్-1 పరిధిలోని 45వ డివిజన్ ద్వారకా వీధిలో సిసి రోడ్డు నిర్మించాలని స్థానిక కార్పొరేటర్ లిఖితపూర్వకంగా కోరిన దానిపై రూ. 33.69 లక్షల అంచనా వ్యయంతో జనరల్ ఫండ్ నుంచి ఖర్చు చేయాలని సమావేశం నిర్ణయం తీసుకుంది. డివిజనల్ సబ్-ట్రెజరీ కార్యాలయానికి అరండల్‌పేట మునిసిపల్ కాంప్లెక్స్‌లోని మూడవ అంతస్తులో ఖాళీగా ఉన్న 608 చదరపు అడుగల ప్రదేశాన్ని అద్దె ప్రాతిపదికన కేటాయిస్తూ సమావేశం నిర్ణయం తీసుకుంది. సర్కిల్-2 పరిధిలో నామినేషన్ పద్దతిలో రూ. ఐదు లక్షలకు లోబడి చేయించిన ఎనిమిది వర్క్సుకు సంబంధించి స్థాయి సంఘం ర్యాటిఫై చేస్తూ ఆమోదించింది. ఈ సమావేశంలో సభ్యులు యరడ్ల ఆంజనేయరెడ్డి, ఉమ్మడి రమాదేవి, బాలసాని మణెమ్మ, వియ్యపు అమర్నాద్, ఎసిజి ఎం వ్యామల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్పందనకు 9 అర్జీలు

ప్రజాశక్తి-విజయవాడ: అర్జీల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి కోరారు. నగరపాలక సంస్థ కమాండ ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. దీనికి నగరంలోని ఆయా ప్రాంతాల ప్రజలు వారి సమస్యలపై తొమ్మిది అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అర్జీలన్నీ నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని అన్నారు. గత వారం వచ్చిన సమస్యల పరిష్కారంపై మేయర్ అధికారులతో సమీక్షించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సింగిల్ మేజర్ సబ్జెక్టుతో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: 2023-24 విద్యా సంవత్సరం నుండి డిగ్రీ కోర్సులకు సంబంధించి ప్రవేశపెట్టనున్న 4 సంవత్సరాల డిగ్రీ ఆనర్స్ కోర్సుల వల్ల ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని స్థానిక డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మహబాష తెలిపారు. కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన సింగిల్ మేజర్ సబ్జెక్టు అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుండి డిగ్రీ కోర్సులో ఒక మేజర్ సబ్జెక్టు మరియు ఒక మైనర్ సబ్జెక్టు ఉంటుందన్నారు. వీటితో పాటు లాంగ్వేజ్ సబ్జెక్టు స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీ డైమెన్షన్ సబ్జెక్టులు ఉంటాయన్నారు. కమ్యూనిటీ షార్ట్‌టర్మ్ మరియు లాంగ్ ప్రాజెక్టులు కూడా చేయవలసి ఉంటుందన్నారు. రెగ్యులర్ డిగ్రీ విద్యార్థులను బిటెక్ డిగ్రీ విద్యార్థులకు ధీటుగా తీర్చిదిద్దడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మస్తాన్‌వలీ, నాగుల్‌మీరా, అధ్యాపకులు ఆలీ, దుర్గాభవాని, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
IA No:639/2021
ఇన్
IA No: 497/2017
ఇన్
ఓ.యన్.నెం.8/2000
పర్ణశాల శటగోప రామానుజాచార్యులు ...పిటిషనర్
వర్సెస్
పర్ణశాల రామకృష్ణ అలియాస్ మురళి వగైరాలు
.... రెస్పాండెంట్లు
To
(అర్1) పర్ణశాల రామకృష్ణ అలియాస్ మురళి, తండ్రి నర్సింహా చార్యులు, విధ్యాధరపురం, ఆర్.టి.సి వర్క్ షాప్ వెనుక, విజయవాడ.
(ఆర్3) పర్ణశాల వేణుగోపాలస్వామి, తండ్రి నర్సింహా చార్యులు విధ్యాధరపురం, ఆర్.టి.సి వర్క్ షాప్ వెనుక, విజయవాడ.
(అర్4) పర్ణశాల రఘురామచక్రవర్తి తండ్రి నర్సింహా చార్యులు విధ్యాధరపురం, ఆర్.టి.సి వర్క్ షాప్ వెనుక, విజయవాడ.
మీరు పై కేసులో 1,3 మరియు 4 రెస్పాండెంట్లు అయి ఉండగా మీకు ఎన్నీ పర్యాయములు నోటీసులు పంపిననూ ఉద్దేశపూర్వకముగా తీసుకొనుట లేదని కోర్టువారికి తెలుపగా శ్రీయుత కోర్టువారు ఈ దిన పత్రికద్వారా మీకు నోటీసు పంపవలసినదిగా ఆదేశించియున్నారు. పై కేసు తే 03-07-2023 దిన వాయిదా అయి ఉన్నది. మీరు తే 03-07-2023 న ఉదయం 10:30 ని.లకు కోర్టువారియెదుట స్వయముగా గాని, న్యాయ వాది ద్వారాగాని హాజరు కావలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
// కోర్టువారి ఉత్తర్వుల మేరకు //
స్థలం: ఒంగోలు
తేది: : 19-06-2023 ఇట్లు
యం.ఎ.శేషాచార్యులు
పిటీషనర్ల తరపు న్యాయవాది
ఒంగోలు,ప్రకాశం జిల్లా.

మొదటిపేజీ తరువాయి

హాస్టల్ విద్యార్థినిపై లైంగిక దాడి?

మహిళలు కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎట్టకేలకు విద్యార్థినిపై లైంగిక దాడి కేసులో సాయంత్రానికి పోలీసులు పురోగతి సాధించారు. దీనిపై విచారణ చేపట్టిన మచిలీపట్నం పోలీసులు నిందితుడిపై సెక్షన్ 376, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి : ఐద్వా

కలెక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నంలో మైనర్ బాలికపై లైంగిక దాడి పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి వి.జ్యోతి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కీర్తి అధికారులను డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో బాలికపై జరిగిన లైంగిక దాడిని పోలీసులు సుమోటోగా స్వీకరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వి జ్యోతి మాట్లాడుతూ మహిళలు, బాలికలపై హింస పెరగడానికి ప్రధాన కారణం డ్రగ్స్, గంజాయి మద్యం వంటి మత్తు పదార్థాలేనన్నారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో గంజాయి కేసులు పెరుగుతున్నాయన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి ఆమె పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి కొడాలి సుజాత, కమిటీ సభ్యులు మర్రరపు పద్మావతి,బూర. భవాని, కీర్తి తదితరులు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

లంకా కాళిదాసు అస్తమయం

పూర్తికాలం కార్యకర్తగా వచ్చి పనిచేశారు. పెదపారుపూడి మండలం దూళ్లవానిగూడెంలో వ్యవసాయ కూలీలకు కూలీ రేట్ల పెంపుదల కోసం పోరాడారు. ఆ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. యలమర్రు గ్రామ శివారు కండ్రికలో భూ పోరాటంలో కూడా పాల్గొన్నారు. బంటుమిల్లి మండలం వైవాక భూ పోరాటంలో పాల్గొని డింగి (పడవ) ప్రమాదంలో నుంచి త్రుటిలో తప్పించుకుని బయటపడ్డారు. గుడివాడ రూరల్ మండలం దొండపాడు గ్రామ శివారు చిలకమూడి భూ పోరాటంలో కీలకపాత్ర వహించారు. కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా జరిగిన అఖిలపక్షం పోరాటంలోనూ పాల్గొన్నారు. ఆర్టీసీ బస్సు చార్జీల పెంపునకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో పాల్గొన్నారు. తాను నమ్మిన సోషలిజం సిద్ధాంతం కోసం తుదిశ్వాస విడిచే వరకూ సిపిఎంలోనే కొనసాగారు. కాళిదాసు మృతికి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బిఆర్ తులసీరావు, పిన్నమనేని మురళీకృష్ణ, సిపిఎం కృష్ణాజిల్లా, ఎన్‌టిఆర్‌జిల్లాల కార్యదర్శులు వై.నరసింహారావు, డి.వి.కృష్ణ తీవ్ర సంతాపం తెలిపారు. కాళిదాసు పార్టీ అభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేశారని గుర్తుచేశారు. సిపిఎం నాయకులు ఆర్ సి పి రెడ్డి, తమ్మిశెట్టి లక్ష్మణరావు, బివి శ్రీనివాసరావు, నీలం మురళీకృష్ణారెడ్డి, వెంకటరావు, బి వి అరుణ, గూడపాటి గోపాలకృష్ణ, టీజీ ప్రకాష్, కనపర్తి సురేష్ బాబు, వై.కోటేశ్వరరావు, రావూరి జోషి, మాజీ మున్సిపల్ చైర్మన్ నగలాపు వెంకటేశ్వరావు తదితరులు తమ సంతాపాన్ని తెలిపారు.

అభివృద్ధికి సర్పంచ్ సహకరించడం లేదు : ఎంపిపి

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామాభివద్ధికి గ్రామ సర్పంచ్, ప్రతిపక్ష పార్టీ నాయకత్వం సహకరించటం లేదని అదే గ్రామానికి చెందిన ఎంపిపి షేక్ బషీర్ ఆరోపించారు. సోమవారం గ్రామంలో తన మద్దతుదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సర్పంచ్ మైనారిటీ మహిళా టిడిపి మద్దతుదారులు కావటంతో మండల పరిషత్ నిధుల ద్వారా గ్రామంలో చేపట్టే అభివద్ధి పనులకు పంచాయతీ తీర్మానం ఇవ్వకుండా అభివద్ధి ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. గ్రామ పంచాయతీ లో నిధులు లేవని గ్రహించిన తాను ఎంపిపి హెూదాలో స్వంత గ్రామంలో అభివద్ధి పనులకు మండల పరిషత్ నిధులను కేటాయించానని, అయితే ఆ నిధులతో అభివద్ధి పనులు చేయటానికి పంచాయతీ తీర్మానం అడిగితే ఇవ్వకుండా అభివద్ధిని అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు.

కరెంట్ బిల్లులతో జనానికి జగన్ షాక్ - సిపిఎం

ప్రజాశక్తి - గుడివాడ

వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు విద్యుత్ బిల్లులు షాక్ కొడుతోందని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో కరెంటు బిల్లులతో జనానికి షాక్ కరపత్రాన్ని సోమవారం ఆవిష్కరించారు. సందర్భంగా ఆర్ సి పి రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాకముందు పాదయాత్రలో కరెంట్ ఛార్జీలు పెంచబోనని వాగ్దానం చేశారన్నారు. 2014లో వాడుకున్న కరెంటు బిల్లుకి ఇప్పుడు ట్రూ అప్ చార్జీల ద్వారా రూ.25 వేల కోట్లు ప్రజల నెత్తిన మోపారన్నారు. యూనిట్ కి 20 పైసలు చొప్పున పెంచి 2021 మే నెలలో వాడిన విద్యుత్ కి మరో 20 పైసలు కలిపి 2023లో ఏప్రిల్ నెలలో ఉపయోగించిన కరెంటుకు యూనిట్ కి 40 పైసలు చొప్పున పెంచారన్నారు. విద్యుత్‌ఛార్జీలకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో ప్రజల్ని కలుపుకొని తగ్గించే వరకు ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణారెడ్డి, ఐద్వా పట్టణ కార్యదర్శి పి.రజని, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆర్.కొండా తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి-పెదపారుపూడి

మండలంలోని మోపర్రు గ్రామంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా మోపర్రు సర్పంచ్

జూపల్లి రాజేశ్వరి అధ్యక్షత వహించారు. సూపర్వైజర్ ఎం. శివ నాగమణి సోమవారం మాట్లాడుతూ పిల్లలకు ఆరేళ్ల వయస్సు వరకూ చాలా చక్కగా చూసుకోవాలన్నారు. ఈ వయస్సులో వారి బ్రెయిన్ డెవలప్మెంట్ ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ వయస్సులో నేర్చుకున్న పిల్లలు తమ జీవితకాలంలో ముందుకు వెళ్తారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, తల్లులు పాల్గొన్నారు.

ఎంఇఒ-2గా మహమ్మద్ మొమిన్

ప్రజాశక్తి-ఘంటసాల

ఘంటసాల ఎంఇఒ -2గా మహమ్మద్ మొమిన్ ఆదివారం నియమితులయ్యారు. మచిలీపట్నంలో జరిగిన కౌన్సిలింగ్ లో ఎంఈఓ -2గా ఘంటసాల మండలం ఎంచుకున్నారు. ఇప్పటివరకు ఆయన లంకపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేశారు. పదోన్నతిపై ఎంఈఓ-2గా నియమితులయ్యారు. సోమవారం ఉదయం ఘంటసాల ఎంఈఓ కార్యాలయం వద్ద విధులకు హాజరయ్యారు.

నోటుపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి ఘంటసాల

మండల పరిధిలోని చిట్టూర్పు గ్రామంలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు నోటుపుస్తకాలను దాత ఓలేటి కేశవరావు సోమవారం అందజేశారు. పాఠశాలలోని 1 నుంచి 5వ తరగతి చదువుతున్న 24 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. అదేవిధంగా గ్రామప్రముఖులు దాసరి బసవ కుటుంబరావు ఆర్థిక సహాయంతో విద్యార్థులకు పెన్సిళ్లు ,, రబ్బర్లు, స్కేల్, షార్పనర్ తదితరాలు కిట్లను అందజేశారు. గ్రామసర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, దాతలు వీటిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

వైఎస్ఆర్ పశు బీమా పథకాన్ని పశు పోషకులు సద్వినియోగం చేసుకొనేలా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ తన చాంబర్లో వైయస్సార్ పశు బీమా పథకం పై రూపొందించిన కరపత్రాలను, గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పశుపోషణపై ఆధారపడిన పశు పోషకులకు ఆపత్కాలంలో వైయస్సార్ బీమా పథకం పశు బీమా పథకం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, సన్నకారు రైతులు గొర్రెలు మేకలు, ప్రమాదవశాత్తు మరణిస్తే ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం గురించిన వివరాలను పశుపోషకులు అందరికీ అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ దివాకర్, డిడిఒ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బీసీల్లో పుట్టిన చీడపురుగు జోగి రమేష్ : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా)

కులాలను తాకట్టు పెట్టేశారని, కుల సంఘాలు ఎందుకొచ్చాయంటూ.. బాపట్లలో బాలుడిపై పెట్రోల్ పోసి తగులబెట్టేసిన స్థలానికి వచ్చి మంత్రి జోగి రమేష్ అవాకులు చెవాకులు పేలుతున్నాడని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, మచిలీపట్నం పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి బత్తిన వెంకట దాస్ లు విమర్శించారు. సోమవారం పార్లమెంట్ కార్యాలయంలో వారు మాట్లాడారు. 15 ఏళ్ల విద్యార్థిని కొంత మంది వైసీపీ గూండాలు, గంజాయి మద్యం మత్తులో పెట్రోల్ పోసి కాల్చేస్తే అక్కడ కులం చూసిన జోగి రమేష్ అసలు మనిషేనా? తండ్రి లేని విద్యార్థిని పెట్రోల్ పోసి అత్యంత కిరాతకంగా కాల్చి చంపేస్తే అక్కడ కులం గురించి మాట్లాడడానికి మంత్రి జోగి రమేష్ సిగ్గుపడాలన్నారు. కులాల ప్రస్తావన ఎందుకు అంటూ ప్రశ్నిస్తున్న జోగి రమేష్.. అసలు రాష్ట్రంలో కులాల్ని రెచ్చగొడుతున్నదెవరు? కులం పేరుతో రాజకీయం చేస్తున్నదెవరు? 26 మంది బీసీల్ని అత్యంత కిరాతకంగా గొంతులు కోసి, పొట్ట పేగులు బయటకొచ్చేలా చీల్చి చంపేస్తే నీవు, నీవు వెనకేసుకొస్తున్న జగన్ రెడ్డి ఏం చేస్తున్నారని మండి పడ్డారు.

మొవ్వ ఎంఇఒ-2 గా శ్రీలక్ష్మి

మొవ్వ: మొవ్వ మండల విద్యాశాఖ అధికారి-2 గా కాటూరుశ్రీలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లాలోని నిడమానూరు జిల్లా పరిషత్ హైస్కూలులో ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న ఆమె ఉద్యోగోన్నతిపై మొవ్వ ఎంఈఓ-2గా వచ్చారు. మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆమెను డేటా ఎంట్రీ ఆపరేటర్ టి.మురళీకృష్ణ, ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ గొరిపర్తి శివ పార్వతి, సిఆర్‌పిలు చీలి నాగరాజు, సిహెచ్ నాగ హిమజ, సిహెచ్. శ్రీమన్నారాయణ, పంది కృష్ణార్జునరావు, తాతా సమర్పణ రావు, కంచర్ల ఆంజనేయులు, ఐఈఆర్టీఎం. వాణిశ్రీ, సబార్డినేట్ ఢీకొల్లు వెంకటేశ్వరమ్మ, తదితరులు స్వాగతించి అభినందించారు.

హత్యకు నిరసన

ఉయ్యూరు : గుంటూరు జిల్లా ఉప్పాలవారిపాలెంలో 15 ఏళ్ళ బాలుడు దారుణ హత్య రాష్ట్రంలో శాంతి భద్రతల వైఫల్యానికి నిదర్శనమని పలువురు ఆందోళన వ్యక్తంచేశారు. అమర్నాథ్ హత్యను నిరసిస్తూ ఉయ్యూరులో గౌడ సంఘం, బీసీ సంఘాల ఆధ్వర్యంలో సోమ వారం స్థానిక ప్రధాన సెంటర్లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి నినాదాలతో హోరెత్తించారు. మాజీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు మాట్లాడారు. టీడీపీ నాయకులు చిరంజీవి, పలియాలశ్రీనివాసరావు, మీసాల అప్పలనాయుడు, ప్రసాద్, పరిమి భాస్కర్, రఫీ, నజీర్, కూనపరెడ్డి వాసు, బూరెల నరేష్, కుటుంబరావు, వెంకటేశ్వర రావు, బోలెం శ్రీనివాసరావు, పైడయ్య, బొర్రా సుబ్బారావు, పి.సుబ్బారావు పాల్గొన్నారు.

10 ఎకరాలు వరిగడ్డి వామి దగ్ధం

ఘంటసాల: ఘంటసాల మండల పరిధిలోని పూషడం గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో 10 ఎకరాల వరిగడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఆకుల సత్యనారాయణకు సంబంధించిన పది ఎకరాల వరిగడ్డి వామి, నివాసం ఉండేందుకు ఏర్పాటు చేసుకున్న పూరిపాక ఈ ప్రమాదంలో దగ్ధం కాగా, రూ.1.10 లక్షలు వరకు నష్టం సంభవించినట్టు యజమాని తెలిపారు. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా, సంఘటనా స్థలానికి అవనిగడ్డ అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను వ్యాప్తి చెందకుండా అదుపు చేశారు.

అంబేద్కర్ యూత్ సేవలు అభినందనీయం : ఎస్ఐ

మొవ్వ: మొవ్వ మండల అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో వేసవి దాహార్తి తీర్చేందుకుగాను కూచిపూడి సెంటర్లో మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని కూచిపూడి ఎస్సై డి సందీప్ పేర్కొన్నారు. యూత్ ఐకమత్యంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించిన ఆయన సమాజానికి మేలు చేసే మంచి కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొవ్వ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, జడ్పీ కోఆప్షన్ సభ్యులు వి పరిశుద్ధ రాజు, కొప్పుల రాజేంద్ర, అన్నవరపు రవి, సహదేవుడు, జయరాజు, మాతంగి గోపి, రామారావు, బాలకృష్ణ తదితర పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

అవనిగడ్డ : మండల పరిధిలోని మోదుమూడి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన గ్రామ ప్రముఖులు కీర్తిశేషులు తోట కోటేశ్వరరావు కుమారుడు తోట శ్యామ్ సుందర ప్రసాద్(48) సోమవారం ఉదయం కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఆయన తన ఇంటి సమీపంలోని దేవాలయంలో ఉదయం ప్రదక్షిణ చేస్తుండగా కరెంట్ షాక్ గురైనట్లుగా సమాచారం. సంఘటనా స్థలంలోనే కుప్పకూలి మరణించినట్లు బంధువులు తెలిపారు. శ్యామ్ సుందరప్రసాద్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అవనిగడ్డకు చెందిన ప్రముఖ సంఘ సేవకులు శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ అధినేత తోట శ్యామ్ కిషోర్ నాయుడుకు స్వయానా చిన్నాన్న కుమారుడు. దీనితో గ్రామంలో అందరికీ సహాయ సహకారాలు అందించే కుటుంబానికి చెందిన వ్యక్తి విద్యుత్ షాక్కు గురై మరణించడం పట్ల మోదుమూడి గ్రామంలో విషాదఛాయలు అముకున్నాయి. చుట్టుపక్కల గ్రామస్తులు కూడా ఈ సంఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు.

సహకార సంఘ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

గ్రామాల్లోని పిఎసిఎస్‌లలో రైతులు మాత్రమే వాటాదారులుగా ఉండాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ సహకార ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్ర

ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు

సహకార బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. కొండల శర్మ,బొల్లినేని రఘురామ్ మాట్లాడారు. పిఎసిఎస్ ఉద్యోగుల పే రివిజన్ ప్రభుత్వంతో సంబంధం లేకుండా డిసిసిబి ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక కమిటీ ద్వారా ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్ణయించాలన్నారు. అనంతరం బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్యామ్ మనోహర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె వి రవికుమార్, రాష్ట్ర నాయకులు బి.శ్యాంప్రసాద్, డి.విజయ్ కుమార్, వాసుదేవరావు, జె.రామాంజనేయులు, హనుమంతరావు, నాగమల్లేశ్వరరావు, రవికుమార్, అర్జునరావు, చక్రవర్తి పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంఇఒ శ్రీనివాసులుకు అభినందనలు

ప్రజాశక్తి-పమిడిముక్కల

రాష్ట్ర గృహ నిర్మాణశాఖామంత్రి జోగి రమేష్, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చేతులమీదుగా ఉత్తమ ఎంఇఒగా పురస్కారం

అందుకున్న ఎంఇఒ శ్రీనివాసులును పలువురు అభినందించారు. కృష్ణాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎస్టియు నాయకులు దేవరపల్లి కోటయ్య సోమవారంనాడు పాడుముక్కల మండలంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఇఒను కలిసి అభినందించారు. పమిడిముక్కల మండలంలో విద్యారంగం అభివృద్ధికి ఎంఇఒ విశేషంగా కృషిచేస్తున్నారన్నారు. కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవటం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బంద్రపల్లి శ్యామ్, కొండవీటి బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రొబేషన్‌ను త్వరగా డిక్లరేషన్ చేయాలి

కలెక్టరేట్ (కృష్ణా): గ్రేడ్ 6 పంచాయతీ కార్యదర్శులు కు ప్రొబేషన్ డిక్లరేషన్ త్వరగా పూర్తి చేయలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు జి. గోపీచంద్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పంచాయతీ అధికారి కె.నాగేశ్వర్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు.కష్ణా జిల్లాలో రెండో నోటిఫికేషన్ ద్వారా 2020-21లో నియామకమైన పంచాయతీ కార్యదర్శులు (గ్రేడ్-4) 52 మందికి ఇంకా ప్రొబేషన్ డిక్లరేషన్ పూర్తి కాలేదని పేర్కొన్నారు. త్వరితగతిన జీఓ 03 ప్రకారం ప్రొబేషన్ డిక్లరేషన్ చేసి,నూతన పే స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కాంతారావు, ట్రెజరర్ నవీన్ , ఆర్గనైజేషన్ సెక్రటరీ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను సిఎం జగన్ సత్కరించనున్నారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. రాష్ట్రస్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం 20వ తేదీ మంగళవారం విజయవాడ ఎ కన్వెక్షన్‌లో జరగనుందని, దీనికి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. సోమవారం ఎ కన్వెక్షన్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, ఇంటర్‌మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ యం.వి.శేషగిరిబాబు, జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎంఎల్‌సి తలశిల రాఘురామ్, మున్సిపల్ కమీషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, సబ్‌కలెక్టర్ అదితి సింగ్‌లతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. పదో తరగతి ఇంటర్‌మీడియట్, డిగ్రీలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ప్రసంశ పత్రాలు, మెమోంటో, శాలువతో ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి, ఇంటర్‌మీడియట్ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ దేవానందరెడ్డి, మిడ్ డే మీల్స్ అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, ఇంటర్‌మీడియట్ ఆర్‌ఐవో రవికుమార్, డిఇవో సివి రెణుక, సమగ్ర శిక్ష ఏపిసి జి.మహేశ్వరరావు ఉన్నారు. ఎ కన్వెక్షన్, పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను డిసిపి విశాల్‌గున్ని సోమవారం పరిశీలించారు.

దుర్గమ్మకు సారె సమర్పణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఆషాఢం సందర్భంగా కనకదుర్గమ్మకు ఆలయ అధికారులు సోమవారం సారె సమర్పించారు. కనకదుర్గానగర్ నుంచి ఊరేగింపుగా ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి దర్శనం చేసుకొని సారె సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం మహామండపం ఆరో అంతస్తులో ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు కట్టా సత్తయ్య, కేసరి నాగమణి, బచ్చు మాధవీ కష్ణ, కార్యనిర్వాహక ఇంజినీర్ కోటేశ్వరరావు, సహాయ కార్యనిర్వాహణాధికారి పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టిడిపి కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి-భవానీపురం: పదో తరగతి విద్యార్థి అమర్నాథ్

గౌడ్‌ను అత్యంత దారుణంగా పెట్రోల్ పోసి తగల బెట్టినందుకు నిరసనగా ఊర్మిళానగర్ పార్క్ సెంటర్ వద్ద 43వ డివిజన్ టిడిపి అధ్యక్షులు దూది బ్రహ్మయ్య యాదవ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలు, మహిళలపై రోజురోజుకూ అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని మండిపడ్డారు. బాలుడి మృతికి కారకులైన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పరశపోగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రమణరావు

ప్రజాశక్తి-విజయవాడ: సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి, భవన నిర్మాణ కార్మికుల పొట్టగొడుతున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రమణారావు పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఎన్‌టిఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌లో సోమవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి కార్మికులను ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. సర్క్యులర్ నెంబర్ 1214ను విడుదల చేసి బోర్డు పని చేయకుండా చేసిందన్నారు. బోర్డు నిధులను జీఓ 17ను విడుదల చేస దారి మళ్లించిందన్నారు. ఇటువంటి విధానాల వల్ల వేలాది మంది కార్మికులు పథకాల కోసం దరఖాస్తు చేసుకొని పరిహారం కోసం ఏళ్ల తరబడి పడిగాపులు కాస్తున్నారని అన్నారు. సంక్షేమ బోర్డులో పేర్లు నమోదు చేసుకొని గుర్తింపు కార్డుల కోసం కూడా ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. ఎన్నడూ లేనంతగా ఇసుక, సిమెంట్, కంకర లాంటి నిర్మాణ మెటీరియల్ ధరలు ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో విపరీతంగా పెరిగిపోతున్నాయన్నారు. దీని వల్ల నిర్మాణ కార్మికులకు పనులు తగ్గిపోతున్నాయని, ఫలితంగా రాబడి తగ్గిపోతూ కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతూ, ఇతర రాష్ట్రాలకు పనుల కోసం వలసలు పోవాల్సిన దుస్థితిలో ఉన్నారని అన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును యధాతథంగా పని చేయించి, పెండింగ్ క్లైమ్‌లకు పరిహారాలను

లెనిన్ సెంటర్ ధర్నా చౌక్‌లో ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బోర్డులో చేరిన కార్మికులందరికీ గుర్తింపు కార్డులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. సర్క్యులర్ 1214ను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి కెవి గోపాలరావు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ వెంకటేశ్వరరావు, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి అప్పారావు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎ కమల, సిఐటియు జిల్లా నాయకులు ఎం శ్రీనివాస్, కె దుర్గారావు, ఇవి నారాయణ, టి నరసింహారావు, పి వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు విబి రాజు, బి గోవింద్, బి బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

వినోదాత్మక చిత్రం 'సామజవరగమన'

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: కుటుంబమంతా చూడదగిన చక్కటి వినోదంతో కూడిన చిత్రంగా సామజవరగమన చిత్రాన్ని రూపొందించినట్లు దర్శకుడు రామ్ అబ్బరాజు అన్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఆహ్వాన యాత్ర విజయవాడ నగరంలో నిర్వహించారు. అనంతరం సోమవారం ఓ హోటల్ లో విలేకరులతో చిత్ర బందం మాట్లాడారు. సామజ వరగమన చిత్రం ఈ నెల 29న విడుదల కానున్నదని తెలిపారు. ఇప్పటికే రెండు పాటలు విడుదలై మంచి ఆదరణ లభిస్తుందన్నారు. సంగీత దర్శకులు గోపి సుందర్ చక్కటి సంగీతాన్ని అందించారని అన్నారు. హీరో శ్రీ కృష్ణ మాట్లాడుతూ రెండు గంటల పాటు కడుపుబ్బ నవ్వించే విధంగా సినిమాని దర్శకుడు తీర్చిదిద్దారని తెలిపారు. సినిమా ఆహ్వాన యాత్ర విజయవాడ నుండి ప్రారంభించినట్లు తెలిపారు. ఇటీవల వినోదంతో కూడిన సినిమాలకు ఆదరణ లభిస్తుందన్నారు. దీనిని దష్టిలో వుంచుకొని వినోదంలో అత్యధిక ప్రాధాన్యత ఇట్చినట్లు చెప్పారు. ఈ సమావేశంలో హీరోయిన్ మోనికా జాన్, నిర్మాత రాజేష్ దండ తదితరులు పాల్గొన్నారు.

జెఇఇలో శ్రీ శ్రీనివాస విద్యార్థికి ర్యాంకు

విస్సన్నపేట: జెఇఇ అడ్వాన్స్ ఫలితాల్లో విస్సన్నపేట శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి ఆజ్మీరా వెంకటపతి జాతీయ స్థాయిలో 1106వ ర్యాంకు సాధించాడు. వెంకటపతి మూడో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు శ్రీ శ్రీవివాస విద్యాసంస్థల్లోనే విద్యనభ్యసించి కార్పొరేట్ స్థాయిలో ర్యాంకు సాధించడం విస్సన్నపేట విద్యారంగానికే గర్వకారణం. అలాగే ఎంసెట్ లో పామర్తి ధర్మతేజమణిచందుకి 7748 ర్యాంకు, ఇంటర్ మొదటి సంవత్సరంలో వివేక్ 464 మార్కులతో డివిజన్‌లో ప్రథమ స్థానం సాధించారు. విస్సన్నపేట విద్యారంగ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా శ్రీ శ్రీనివాస జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినందుకు కళాశాల డైరెక్టర్లు మద్దిరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, ఎన్ వెంకట్, రాజేంద్రప్రసాద్, రాజేశ్వరరెడ్డి విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు.

హిమాలయ కొత్త షాంపు విడుదల

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

హిమాలయ వెల్‌నెస్ కంపెనీ రూ.2 సాచెట్ రూపంలో రెండు కొత్త షాంపూలను ప్రవేశపెట్టిందని కంపెనీ జనరల్ మేనేజర్ సుశీల్ గో స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. చుండ్రు నియంత్రణకు కలబంద షాంపూ, జుట్టు రాలడాన్ని నియంత్రించడానికి భంగరాజ షాంపూ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ షాంపూలు సహజ పదార్థాలతో నిండి ఉంటాయన్నారు. ఇవి సమర్థవంతమైన జుట్టు సంరక్షణ పరిష్కారాలను అందించడానికి జాగ్రత్తగా ఎంపిక చేయబడతాయని హిమాలయ వెల్‌నెస్ కంపెనీ పర్సనల్ కేర్ జిఎం సుశీల్ గోస్వామి పేర్కొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని తమ సొంత సమస్యగా భావించి అధికారులు త్వరగా పరిష్కారం చూపాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, డిఆర్‌వో కె.మోహన్‌కుమార్ ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అధికారులు సమస్యను నిశితంగా పరిశీలించడం ద్వారా సమస్య తేలికగా పరిష్కారం అవుతుందన్నారు. స్పందనలో వచ్చిన ప్రతీ ఆర్జీ పరిష్కారానికి సంబంధిత మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడివోలు, తహాశీల్దార్లతో వర్చువల్‌గా మాట్లాడి సమస్యను క్షుణ్ణంగా వారికి వివరించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'చెత్త' వాహనాల వినియోగంలో అలసత్వం

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజారోగ్య విభాగంలోని అధికారులు, దిగువ స్థాయి పర్యవేక్షణాధికారుల నడమ లోపించిన సమన్వయం కారణంగా చెత్త తరలించే వాహనాల వినియోగం డివిజన్లలో అస్తవ్యస్తంగా తయారయింది. చెత్త తరలించే వాహనాలు నగరపాలక సంస్థ వెహికల్ డిపో నుంచి ఆయా డివిజన్లకువెళ్లిన వాహనాలను సంబందిత డివిజన్ల శానిటరీ ఇనిస్పెక్టర్లు అందుబాటులో ఉండి, డివిజన్లలో పోగయిన చెత్తను వెంటనే లోడ్ చేయించి పంపించాల్సి ఉంది. కానీ ఆయా డివిజన్లలోని పలువురు శానిటరీ ఇనిస్పెక్టర్లు పట్టించుకోకుండా, వేరే వ్యవహారాల్లో ఉంటూ వాహనాలను అలాగే వారి డివిజన్లలోనే గంటల తరబడి ఉండటంతో పక్క నున్న డివిజన్లకు ఆలస్యమవుతుంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ప్రజారోగ్య విభాగం అధికారులు మిన్నకుండి పోతుండటంతో డివిజన్లలో చెత్త తరలింపు ప్రక్రియ చాలా ఆలస్యమవుతుందని ఆయా డివిజన్ల నుంచి నగరపాలక సంస్థకు ఫిర్యాదులు అందుతున్నట్లు తెలిసింది. పాడైపోయి, మరమ్మతులు చేయించాల్సిన వాహనాలను పట్టించుకోకుండానే డివిజన్లకు పంపిస్తుండటంతో వాహనాలు నిలిచిపోయి అటు డ్రైవర్లతో పాటు ఇటు డివిజన్లలో పని కుంటుపడుతుందని పలువురు అధికారుల నుంచే సమాచారం వినిపిస్తుంది. ఎప్పటికప్పుడు వెహికల్ డిపోలో వాహనాల రిపేరు పనులు సరిగా జరగడం లేదనే చర్చ డిపోలో లేకపోలేదు. వాహనాలకు అవసరమైన స్పేర్‌పార్ట్స్ అందుబాటులో లేకపోవడం, ఉన్నా కానీ వినియోగించకపోవడం కారణంగా చిన్న రిపేర్లకే ఎంతో విలువైన వాహనాలను డిపోకే పరిమితం చేయాల్సి వస్తోందనే చర్చ కార్మికుల్లో వ్యక్తం అవుతుంది. స్వీపింగ్ మిషన్ల వంటి వాహనాల నిర్వహణ సరిగా లేక కొన్ని వినియోగించకపోతున్నా...బిల్లులు మాత్రం సదరు కాంట్రాక్టర్లకు చెల్లింపులు తప్పడం లేదనే చర్చ కూడా డిపోలో లేకపోలేదు. విజయవాడలో 11 టిప్పర్లు, 45 కాంపాక్టర్స్, 23 ట్రాక్టర్లు, తొమ్మిది టెన్‌టైర్ల వాహనాలు, ఎనిమిది స్వీపింగ్ మిషన్లు పెద్దవి, మరో ఎనిమిది చిన్నవి స్వీపింగ్ మిషన్లు వెహికల్ డిపో పరిధిలో ఉన్నాయి. అయితే వీటన్నింటికీ ఆయిల్ ఖర్చు దగ్గర నుంచి కార్మికుల వేతనాలు, షెడ్ నిర్వహణ, స్పేర్‌పార్ట్స్, కాంట్రాక్టర్లకు, ఇతర నిర్వహణకు నెలకు కోట్లాది రూపాయలు వ్యయం అవుతుంది. భారీ స్థాయిలో చెల్లింపులు జరుగుతున్నా వీటి వల్ల కలిగే ఉపయోగం నామమాత్రమేనని స్వయంగా పలువురు ఉద్యోగులు తెలుపుతుండటం గమనార్హం.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం
పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...
మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218
విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.